




నమస్తే
# మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

ఆదివారం
17-05-2026 సంపుటి : 01 సంచిక : 56 పేజీలు : 08 వెల : ₹ 5/-

తెలుగు దినపత్రిక








Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com




## తెలంగాణలో జూన్‌లో
# సర్ ప్రారంభం

- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే
- జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల
- జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల
- సీఈవో సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్ మే 16 (మహాప్రభ):**
దేశ వ్యాప్తంగా సర్ ప్రక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్వో లు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం-6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు బుక్ ఏ కాల్ విత్ బీఎల్వో సదుపాయం కల్పించినట్లు చెప్పారు.

-మిగతా 3 లో



## ఉగ్రవాదులను ఉసికొల్పితే
# అంతే సంగతులు

- దాయాది దేశానికి భారత ఆర్మీ చీఫ్ స్ట్రాంగ్ వార్నింగ్
- అమాయక పర్యటకులపై పహల్గాంలో గతేడాది ఉగ్రదాడి
- ఈ క్రమంలో పాక్‌కు ఆపరేషన్ సింధూర్‌తో ధీటుగా బదులిచ్చిన ఇండియా
- మళ్ళీ ఆ పరిస్థితులు తలెత్తితే ఊరుకోబోమని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరిక


3 లో

చరిత్రలో ఉంటారో లేదో పాక్ నిర్ణయించుకోవాలి

## డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే
# భారత్ టాప్


ప్రజాస్వామ్యానికి మనది మాతృదేశం

- ది హేగ్‌లో ప్రవాస భారతీయులతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశం
- ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపిస్తుంది అన్న మోదీ
- తరాలు మారినా, దేశాలు మారినా భారతీయ కుటుంబ విలువలు, సంస్కృతి మారలేదు
- భారత్, నెదర్లాండ్స్ కలిసి భవిష్యత్ సరఫరా వ్యవస్థపై దృష్టి
- సెమీకండక్టర్ తయారీలో భారత్ కీలక ముందడుగు వేసిందన్న ప్రధాని



**న్యూఢిల్లీ: మే 16 (మహాప్రభ):**
నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్- నెదర్లాండ్స్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా అక్కడి భారతీయుల కృషి, ప్రతిభ గురించి ఎంతో ప్రశంసిస్తారని చెప్పారు. నెదర్లాండ్స్ ఆర్థిక వ్యవస్థకు భారతీయులు అందిస్తున్న

-మిగతా 3 లో



## బంగారం
# ధరల్లో పతనం

- పదిగ్రాములపై రూ.980ల మేర తగ్గిన ధర
- రూపాయి మారకం కనిష్టానికి చేరిక

**న్యూఢిల్లీ, మే 16 (మహాప్రభ):**
భారత్‌లో శనివారం కూడా బంగారం, వెండి ధరల్లో పతనం కనిపించింది. అంతర్జాతీయ అనిశ్చితులకు తోడు యూఎస్ డెట్ సెక్యూరిటీలపై రాబడులు పెరగడం, డాలర్ బలపడుతున్న నేపథ్యంలో దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర శుక్రవారంతో పోలిస్తే రూ.980ల మేర తగ్గి రూ.1,56,930కు పడిపోయింది. 22 క్యారెట్ల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.900ల మేర తగ్గి రూ.1,43,850కు చేరుకుంది. నగరంలో కిలో వెండి ధర రూ.15 వేల మేర తగ్గి రూ.2.9 లక్షలకు దిగింది. దేశవ్యాప్తంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర సగటున రూ.950 మేర తగ్గింది. వెండి ధరలో రూ.10 వేల మేర కోత పడింది. చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,60,910కు చేరుకుంది. 22 క్యారెట్ల గోల్డ్ రూ.1,47,500 వద్ద ట్రేడవుతోంది. న్యూఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి

-మిగతా 3 లో

# భానుడి భగభగ

- మళ్లీ 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీలు
- గాలిలో తగ్గిన తేమ శాతం...ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- పలు జిల్లాల్లో కురిసిన వర్షం



3 లో



# భారత్‌లో పెరిగిన నిరుద్యోగం

ఏకంగా 6 నెలల గరిష్టానికి!

- దేశంలో పెరిగిన నిరుద్యోగిత రేటు
- ఆరు నెలల గరిష్ట స్థాయికి చేరినట్లు తెలిపిన ప్రభుత్వ గణాంకాలు
- పట్టణ ప్రాంతాల్లో తగ్గిన రేటు

**న్యూఢిల్లీ: మే 16 (మహాప్రభ):**
దేశంలో నిరుద్యోగిత రేటు పెరిగింది. 2026 ఏప్రిల్‌లో 5.2 శాతానికి చేరింది. ఇది ఆరు నెలల గరిష్ట స్థాయి అని ప్రభుత్వం పేర్కొంది. మార్చిలో ఇది 5.1 శాతంగా ఉండగా, తాజాగా స్వల్పంగా పెరిగినట్లు తెలిపింది. అయితే పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగిత మాత్రం 10 నెలల కనిష్టానికి తగ్గినట్లు చెప్పింది. ఈ మేరకు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా పీరియాడిక్

-మిగతా 3 లో



## లొంగిపోయిన
# బండి భగీరథ్!

- పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో లొంగుబాటు
- ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు
- ముందస్తు సమాచారం ఇచ్చి సరెండర్

తెలంగాణతోపాటు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన బండి భగీరథ్ కేసు కీలక మలుపు తిరిగింది. మధ్యంతర బెయిల్ ఈ దశలో ఇవ్వలేమని హైకోర్టు చెప్పడంతో బండి భగీరథ్ శనివారం రాత్రి పోలీసుల ఎదుట లొంగిపోయారు. పేట్ బషీరాబాద్ పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చి వారి ఎదుట సరెండర్ అయ్యారు. బండి భగీరథ్ కేసులో రాత్రి నుంచి నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ పెద్దరికంతో వ్యవహరించి కుమారుడిని తీసుకొచ్చి అప్పగించాలని రేవంత్ రెడ్డి కామెంట్స్ చేశారు. తర్వాత కాసేపటికే హైకోర్టు కూడా ఆయనకు ముందస్తు బెయిల్ పై వచ్చే వారం తీర్పు ఇస్తామని పేర్కొంది.

3 లో

## మోడీ నిర్ణయం, సామాన్యుల
# నడ్డి విరచడమే

యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపు

- ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుంది
- నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం
- మోడీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది
- ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదు
- రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలింది
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందన



3 లో

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు.



## దేశంలో 80
# సార్లు పేపర్ లీక్..

- విద్యామంత్రిని తొలగించాలి..
- నీట్ పేపర్ లీక్‌పై స్పందించిన రాహుల్ గాంధీ..

**న్యూఢిల్లీ: మే 16 (మహాప్రభ):**
నీట్ పేపర్ లీక్ విషయంలో ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పేపర్ లీక్‌లు దేశ విద్యా వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశాయని, లక్షలాది మంది యువత భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయని ఆయన అన్నారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని ప్రధానిని డిమాండ్ చేశారు. 22 లక్షల మంది విద్యార్థుల కష్టం, కృషి వృథా అయ్యిందని రాహుల్ గాంధీ అన్నారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నప్పటికీ, విద్యాశాఖ మంత్రి మాత్రం ఈ వ్యవహారంతో తమకు సంబంధంలేదని చెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో ఇప్పటి వరకు 80 సార్లు పేపర్ లీక్స్ జరిగాయని, సుమారు 2 కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని ఆయన అన్నారు. కేవలం ఇది పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదని, విద్యా వ్యవస్థలో ఒక విస్తృతమైన నెట్‌వర్క్ ఫలితమే అని రాహుల్ గాంధీ అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తుల్ని విద్యావ్యవస్థలో నియమించడం విద్యా సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తోందని ఆరోపించారు.

-మిగతా 3 లో

# సర్ పై అప్రమత్తత అవసరం

- ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- నియోజకవర్గ ఇంచార్జీలు, అభ్యర్థులతో మంత్రి పొన్నం సమీక్ష



**హైదరాబాద్ మే 16 (మహాప్రభ):**
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల విస్తరణ, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యాలయంలో శనివారం కీలక సమావేశం నిర్వహించారు. మంత్రి క్వార్టర్స్‌లో జరిగిన ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కృష్ణ శ్రీశైలం గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే

-మిగతా 3 లో

## 182 కోట్ల ఖరీదైన జిహాదీ డ్రగ్ స్వాధీనం

- కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ మే 16 (మహాప్రభ):**
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. దేశంలో తొలిసారి జిహాదీ డ్రగ్ ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ నార్కోటిక్స్ ట్రాఫిక్కింగ్ బృందంపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. కాప్టగాన్ అనే ఆ డ్రగ్ విలువ మార్కెట్లో సుమారు 182 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్రగ్స్ పట్టివేతకు ఆపరేషన్ రేజ్‌పిల్ అనే కోడ్ నేమ్ పెట్టారు. డ్రగ్ ట్రాఫిక్కింగ్‌కు పాల్పడిన విదేశీ వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ కన్‌సైన్మెంట్ ను పశ్చిమాసియా దేశాలకు తరలిస్తున్నారు. ఇండియాను ట్రాన్సిట్ మార్గంలో వాడేందుకు ప్రయత్నించారు. అమిత్ షా తన ఎక్స్ అకౌంట్‌లో ఈ విషయాన్ని చెప్పారు. డ్రగ్ ఫ్రీ ఇండియా కావలన్న లక్ష్యంతో మోదీ సర్కారు పనిచేస్తోందని, దానిలో భాగంగానే అరెస్టులు జరిగినట్లు వెల్లడించారు. ఆపరేషన్ రేజ్‌పిల్ ద్వారా జిహాదీ డ్రగ్‌ను పట్టుకోవడం గర్వంగా ఉందని అన్నారు. ఇండియాలోకి ఎంటరయ్యే ప్రతి గ్రాము డ్రగ్‌ను విడిచిపెట్టేది లేదన్నారు. క్యాప్టగాన్ అనేది అంఫిటమైన్ తరహా ఉత్ప్రేరకం. ఇది నిషేధిత డ్రగ్. పశ్చిమాసియాలోని మిలిటెంట్ గ్రూపులు, వ్యవస్థీకృత నేరగాళ్లు దీన్ని వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. కన్‌సైన్మెంట్ వెనుక ఉన్న భారీ నెట్వర్క్‌ను చేధించనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయంగా డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిపై కూడా ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు.. భారత యువతను చూసి గర్విస్తున్నా

- సీజేఐ సూర్యకాంత్



**న్యూఢిల్లీ మే 16 (మహాప్రభ):**
కొందరిని తాను పరాన్నజీవులుగా లేదా బొద్దింకలుగా పోల్చిన వివాదంపై భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందించారు. ఒక కేసు విచారణ సందర్భంగా తాను మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని చెప్పారు. నకిలీ సర్టిఫికెట్‌లు, బోగస్ డిగ్రీలతో మీడియాలోకి, న్యాయవ్యవస్థలోకి, ఇతర వృత్తుల్లోకి ప్రవేశించేవారిని ఉద్దేశిస్తూ తాను ఈ వ్యాఖ్యలు చేశానని అన్నారు. అలాంటి వారే మీడియా, సోషల్ మీడియా తోపాటు ఇతర రంగాల్లోకి చొరబడ్డారని అన్నానని చెప్పారు. అలాంటి వారినే తాను పరాన్నజీవులుగా పేర్కొన్నట్లు తెలిపారు. కానీ మీడియాలో కొందరు తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన సీజేఐ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతీయ యువతపట్ల తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. శుక్రవారం ఓ కేసు విచారణ సందర్భంగా మౌఖికంగా చేసిన వ్యాఖ్యలను మీడియాలోని ఒక వర్గం వక్రీకరించిన తీరును చదివి తాను ఆవేదన చెందానని చెప్పారు. మన దేశ యువతను విమర్శించానని చెప్పడం పూర్తిగా నిరాధారమని అన్నారు. మన దేశ యువతను చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని పేర్కొన్నారు. తనపట్ల భారత యువతకు గౌరవ మర్యాదలు ఉన్నాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని అన్నారు. యువతను దేశాభివృద్ధికి మూలస్తంభాలుగానే చూస్తానని సూర్యకాంత్ తెలిపారు.

## థాయిలాండ్ లో ఘోర ప్రమాదం

.8మంది మృతి



**బ్యాంకాక్ మే 16 (మహాప్రభ):**
థాయిలాండ్ లో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. రైలు ఢీకొనడం వలన చెలరేగిన మంటలు బస్సును, సమీపంలోని వాహనాలను చుట్టుముట్టాయి. ఈ ప్రమాదంలో రు 8మంది మరణించగా, మరో 25 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. రైలు ఢీకొనడంతో మంటలు చెలరేగాయని, అవి బస్సును, సమీపంలోని వాహనాలను చుట్టుముట్టాయని అన్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందిని, సహాయక బృందాలను ఘటనా స్థలానికి పంపినట్లు ప్రకటించారు. ప్రస్తుతం మంటలను అదుపులోకి తీసుకువచ్చారని, బాధితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రమాదానికి గల కారణంపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఇరాన్‌పై మరోసారి దాడులకు సిద్ధమవుతున్న అమెరికా..

### ఈసారి 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ 2.0'



**న్యూఢిల్లీ మే 16 (మహాప్రభ):**
ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులకు సిద్ధమవుతోందా..? తాజా పరిణామాలు చూస్తుంటే ఔననే అనిపిస్తోంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ, శాంతి చర్చలు కొలిక్కి రావడం లేదు. చర్చల్లో చాలా రోజులుగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. చర్చలు ఎటూ తేలడం లేదు. ఇరాన్, అమెరికా.. ఎవరికి వారు మొండి పట్టుదలతో ఉన్నారు. దీంతో సమస్య పరిష్కారానికి సైనిక చర్య ఒక్కటే సరైన దారి అని అమెరికా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంటే, మరోసారి ఇరాన్‌పై దాడులు చేసేందుకు అమెరికా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈసారి దాడులకు 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ 2.0' అనే పేరు పెట్టినట్లు తెలుస్తోంది. అందులోనూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తాజాగా చైనాలో పర్యటించడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూరుస్తోంది. ఇరాన్ అణ్వాయుధ దేశం కావడాన్ని అమెరికాతోపాటు చైనా కూడా వ్యతిరేకించినట్లు అమెరికా తెలిపింది. ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదని ఇరు దేశాలు భావిస్తున్నాయి. దీంతో తాజా చర్చల్లో ఇరాన్‌పై దాడులు, అణ్వాయుధ తయారీ, హార్ముజ్ జలసంధి వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఇరాన్‌పై దాడులకు చైనా మద్దతును అమెరికా కోరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, మళ్లీ దాడులకు దిగే అంశంపై అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రెండు దేశాల మధ్య గత ఏప్రిల్ 7 నుంచి కాల్పుల విరమణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నెల రోజులు గడిచినప్పటికీ శాశ్వత శాంతి ఒప్పందం మాత్రం కుదరడం లేదు. ఇరాన్ శాంతి ప్రతిపాదనల్ని అమెరికా అంగీకరించడం లేదు. అణ్వాయుధ తయారీ అంశంలో అంగీకారం కుదరడం లేదు. అలాగే, అమెరికా ప్రతిపాదనల్ని ఇరాన్ వ్యతిరేకిస్తోంది. ప్రస్తుత పరిస్తితుల్లో ఇరాన్‌పై దాడులకు అమెరికా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు ఇజ్రాయెల్ కూడా ఇందుకు సిద్ధంగా ఉన్నట్లు అమెరికా ప్రతినిధులు తెలిపారు. త్వరలో ఇరాన్--అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదరకపోతే మళ్లీ దాడులు ప్రారంభమయ్యే అవకాశం మాత్రం ఉంది. ఇదే సమయంలో అవసరమైతే తిరిగి యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ కూడా ప్రకటించింది. మరోవైపు ఇరాన్‌పై యుద్ధం అంశం ట్రంప్‌కు రాజకీయంగా ఎలాంటి ఇబ్బందుల్ని తెస్తుందో చూడాలి. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో మిడ్ టర్మ్ ఎన్నికలు జరుగుతాయి.

## మాల్దీవుల్లో విషాదం..

### స్కూబా డైవింగ్‌కు వెళ్లి ఐదుగురు మృతి.. కొనసాగుతున్న గాలింపు



**న్యూఢిల్లీ మే 16 (మహాప్రభ):**
పర్యాటక కేంద్రమైన మాల్దీవుల్లో విషాదం జరిగింది. అక్కడి దీవుల్లోని ఒక సముద్ర గర్భంలోని గుహలోకి స్కూబా డైవింగ్ చేస్తూ వెళ్లిన ఐదుగురు అన్వేషకులు ప్రాణాలు కోల్పోయారు. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద స్కూబా డైవింగ్ ప్రమాదమని అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. స్థానిక మీడియా, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటలీకి చెందిన మోనికా మాంటెఫాల్కన్, జార్జియా సోమాకల్, ఫెడెరికో గ్వాల్టెరి, మ్యురియెల్ ఒడెనినో, జియాన్లుకా బెనెడెట్టి అనే ఐదుగురు స్కూబా డైవర్లు వావు అటోల్ అనే సముద్ర గర్భంలోని గుహలోకి గురువారం నాడు అన్వేషణకు వెళ్లారు. ఇది దాదాపు 50 మీటర్ల లోతు కలిగి ఉంటుంది. నీళ్లలో అన్వేషణకు వెళ్లిన వారు ఎంతసేపటికీ పైకి రాలేదు. దీనిపై సమాచారం అందుకున్న అధికారులు, రక్షక దళాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. ఐదుగురి కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. వీరిలో బెనెడెట్టి అనే ఒక స్కూబా డైవర్ మృతదేహం మాత్రమే దొరికింది. నీళ్లలో గుహ ముఖద్వారం వద్ద అతడి మృతదేహం లభ్యమైంది. మిగతా నలుగురి కోసం ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. శుక్రవారం నుంచి ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. ఎనిమిది మంది డైవర్లు ఇందులో పాల్గొంటున్నట్లు మాల్దీవ్స్ అధికారులు తెలిపారు. ఇటలీకి చెందిన మరో ఇద్దరు డైవర్లు కూడా సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంలో ఇటలీ ప్రభుత్వం కూడా సహకారం అందిస్తోందన్నారు. కాగా, ఈ ఐదుగురు స్కూబా డైవర్ల మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అయితే, లోపలి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడమే కారణాలుగా అనుమానిస్తున్నారు.

## తమిళనాడు మంత్రులకు శాఖలు కేటాయింపు..

### -సీఎం విజయ్ వద్ద హోం శాఖ



**చెన్నై మే 16 (మహాప్రభ):**
తమిళనాడులో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వంలోని మంత్రులకు శాఖలను శనివారం కేటాయించారు. హోం, పోలీస్, మహిళా శిశు సంక్షేమం వంటి కీలక శాఖలను ముఖ్యమంత్రి విజయ్ తన వద్దే ఉంచుకున్నారు ప్రజా, సాధారణ పరిపాలన, రెవెన్యూ, ప్రత్యేక కార్యక్రమాల అమలు, యువజన, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం, పురపాలక పరిపాలన, పట్టణ, నీటి సరఫరా శాఖల బాధ్యతలు కూడా ఆయన నిర్వహించనున్నారు. కాగా, సీనియర్ నేత కేఏ సెంగోట్టయ్యన్‌కు ఆర్థిక శాఖ కేటాయించారు. కొత్త ప్రభుత్వంలో ఆర్థిక, పెన్షన్లు, పెన్షన్ అలవెన్సుల శాఖలను ఆయన నిర్వహిస్తారు. విజయ్ కేబినెట్‌లో పిన్న వయస్కురాలైన మంత్రి సెల్వి ఎస్ కీర్తనకు పరిశ్రమల శాఖను కేటాయించారు. పెట్టుబడుల ప్రోత్సాహ శాఖ బాధ్యతలను కూడా ఆమె పర్యవేక్షిస్తారు. మరోవైపు టీవీకేలో కీలకమైన ఎన్ ఆనంద్ గ్రామీణాభివృద్ధి, జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీలు, పంచాయతీ యూనియన్, పేదరిక నిర్మూలన, గ్రామీణ రుణగ్రస్తత, చిన్న నీటిపారుదలతో సహా సాగునీటి ప్రాజెక్టులు ఆయన పరిధిలోని శాఖల్లో ఉన్నాయి. మరో మంత్రి ఆదవ్ అర్జునకు ప్రజా పనులు, క్రీడాభివృద్ధి శాఖలు కేటాయించారు. క్రీడాభివృద్ధితో పాటు భవనాలు, రహదారులు, చిన్న ఓడరేవులతో సహా ప్రజా పనులను ఆయన పర్యవేక్షిస్తారు. డాక్టర్ కేజీ అరుణ్‌రాజ్‌కు ఆరోగ్యం, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖలను కేటాయించారు. కాగా, పి. వెంకటరమణన్‌కు ఆహార, పౌర సరఫరాల శాఖలు లభించాయి. వినియోగదారుల పరిరక్షణ, ధరల నియంత్రణ వ్యవహారాలు కూ ఆయన పర్యవేక్షణలో ఉన్నాయి. మరో మంత్రి ఆర్. నిర్మల్ కుమార్‌కు ఇంధన వనరులు, న్యాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. విద్యుత్, సంప్రదాయేతర ఇంధన అభివృద్ధి, న్యాయ శాఖ, న్యాయస్థానాలు, జైళ్లు, అవినీతి నివారణ, శాసనసభ, గవర్నర్, ఎన్నికలు, పాస్‌పోర్ట్‌ల శాఖలు ఆయన పరిధిలోకి వస్తాయి. మంత్రి రాజ్‌మోహన్‌కు పాఠశాల విద్య, తమిళ అభివృద్ధి, సమాచార, ప్రచార శాఖ బాధ్యతలు అప్పగించారు. పురావస్తు శాస్త్రం, తమిళ అధికార భాష, తమిళ సంస్కృతి, ఫిల్మ్ టెక్నాలజీ, సినిమాటోగ్రాఫ్ చట్టం, న్యూస్‌ప్రింట్ నియంత్రణ, స్టేషనరీ, ప్రింటింగ్, ప్రభుత్వ ముద్రణాలయాలను కూడా ఆయన పర్యవేక్షిస్తారు. మరో మంత్రి డాక్టర్ టి.కె. ప్రభుకు సహజ వనరుల శాఖను కేటాయించారు. ఖనిజాలు, గనుల శాఖల బాధ్యతలను ఆయనకు అప్పగించారు.

## 18న కేరళలో యూడిఎఫ్ ప్రభుత్వం

-నేడు గవర్నర్‌కు మంత్రుల జాబితా
-కాబోయే సిఎం అభ్యర్థి సతీషన్ వెల్లడి



**తిరువనంతపురం,మే 16 (మహాప్రభ):**
కేరళంలో యూడీఎఫ్ ప్రభుత్వం 18న కొలువు తీరనుంది. మంత్రివర్గం ఏర్పాటుపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, ఈనెల 17వ తేదీ ఆదివారంనాడు మంత్రుల జాబితాను గవర్నర్‌కు అందజేస్తామని ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నట్టు వీడీ సతీశన్ తెలిపారు. మే 18న తనతో పాటు మంత్రులంతా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) నేతలతో శనివారంనాడు సమావేశానంతరం మీడియాతో సతీశన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలుచేసినా సెక్యులర్ విధానాన్ని కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నట్టు సతీశన్ చెప్పారు. 'కేరళంలో కొన్ని శక్తులు విద్వేష ప్రచారం సాగిస్తున్నాయి. కానీ ముస్లిం లీగ్, వారి నేత పనక్కాడ్ సైయిద్ సాదిఖ్ అలి బలమైన సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉన్నారు. యూడీఎఫ్ కూడా సెక్యులర్ విధానానికి కట్టుబడి ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం' అని వివరించారు. ఎన్నికల ప్రచారంలో ఐయూఎంఎల్‌తో యూడీఎఫ్ పొత్తును బీజేపీ, సీపీఎం లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేశాయని, కానీ ప్రజలు ఆ ఆరోపణలను తిప్పికొట్టి 102 సీట్లలో తమను గెలిపించారని సతీశన్ చెప్పారు. కాగా, దీనికి ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాల నివాసానికి వెళ్లి సతీశన్ కలుసుకున్నారు. మంత్రివర్గం కూర్పు, శాఖలపై ఆయనతో చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌పై యూడీఎఫ్ విజయం సాధించింది. 140 స్థానాల్ల 102 సీట్లు గెలుచుకుంది. 2021 నుంచి విపక్ష నేతగా సతీశన్ వ్యవహరిస్తూ ఎల్‌డీఎఫ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో ఆయనను సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది.

# భారత్‌లో పెరిగిన నిరుద్యోగం

మొదటి తరువాయి

లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) నెలవారీ బులెటిన్‌లో పేర్కొంది.

**గ్రామీణ ప్రాంతాల్లోనే నిరుద్యోగిత పెరుగుదల**

దేశవ్యాప్తంగా నిరుద్యోగిత పెరగడానికి ప్రధాన కారణం గ్రామీణ భారతదేశమేనని నివేదిక తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగిత రేటు మార్చిలో 4.3 శాతం ఉండగా, ఏప్రిల్‌లో లి4.6 శాతానికిలి పెరిగింది. ఇక పట్టణ ప్రాంతాల్లో మాత్రం నిరుద్యోగిత 6.8 శాతం నుంచి లి6.6 శాతానికిలి తగ్గింది. ఇది ఏప్రిల్ తర్వాత నమోదైన అత్యల్ప స్థాయి అని గణాంకాలు తెలిపాయి. జనవరి-మార్చి త్రైమాసికంలో 6.6 శాతం నమోదైంది.

**పట్టణ మహిళలకు ఉపాధి అవకాశాలు - జాతీయ స్థాయిలో సవాళ్లు**

పట్టణ ప్రాంతాల్లో ఈ మెరుగుదల ముఖ్యంగా మహిళల్లో స్పష్టంగా కనిపించింది. పట్టణ మహిళల నిరుద్యోగిత రేటు మార్చిలో 9.0 శాతం ఉండగా, ఏప్రిల్‌లో లి8.5 శాతానికిలి తగ్గింది. ఇది ఏడాది కనిష్ట స్థాయిని సూచిస్తుంది. పట్టణ పురుషుల నిరుద్యోగిత కూడా 6.1 శాతం నుంచి 5.9 శాతానికి తగ్గింది. దేశవ్యాప్తంగా చూస్తే మహిళల ఉద్యోగ పరిస్థితి ఇంకా సవాల్‌తోనే ఉందని నివేదిక తెలిపింది. మహిళల మొత్తం నిరుద్యోగిత రేటు మార్చిలో 5.3 శాతం ఉండగా, ఏప్రిల్‌లో 5.4 శాతానికి పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది 5.0 శాతంగా నమోదైంది. ఇక పురుషుల నిరుద్యోగిత కూడా మార్చిలో 5.0 శాతం నుంచి ఏప్రిల్‌లో 5.1 శాతానికి పెరిగింది. అయితే 2025 ఏప్రిల్‌లో నమోదైన 5.2 శాతంతో పోలిస్తే స్వల్పంగా తక్కువగానే ఉంది.

# దేశంలో 80 సార్లు పేపర్ లీక్..

మొదటి తరువాయి

ఆర్ఎస్ఎస్ తో సంబంధం ఉన్న వ్యక్తుల్ని వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్-బీజేపీ విద్యావ్యవస్థను నాశనం చేసిందని, విద్యా వ్యవస్థ కేవలం డబ్బు సంపాదించే సాధనంగా మారిందని అన్నారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న వారిని అరెస్ట్ చేయాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన అన్నారు. పదే పదే జరుగుతున్న పేపర్ లీక్స్ విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోందని అన్నారు.

# సర్ పై అప్రమత్తత అవసరం

మొదటి తరువాయి

ఆది శ్రీనివాస్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల డీసీసీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో కార్యకలాపాలను వేగవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులకు సూచనలు చేసినట్లు సమాచారం. అలాగే సర్ (ఓటరు జాబితా సవరణ) కార్యక్రమంపై నియోజకవర్గ ఇంచార్జీలు, కోఆర్డినేటర్లు అప్రమత్తంగా ఉండాలని సమావేశంలో స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ నేతలు చురుకుగా వ్యవహరించాలని సూచించారు. పార్టీలో ప్రారంభం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న నాయకులకు గుర్తింపు ఇవ్వాలని, నామినేటెడ్ పార్టీ పదవుల విషయంలో పార్టీ నిర్ణయించిన మూడు సంవత్సరాల ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని చర్చ జరిగింది. సమావేశం అనంతరం ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ తో కరీంనగర్ పార్లమెంట్ ముఖ్య నేతలు జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ ఓటరు జాబితా సవరణ అంశంపై నేతలకు దిశానిర్దేశం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బీఎల్ఏల నియామకాన్ని గ్రామస్థాయిలో పూర్తి చేయాలని, కొత్త మండల అధ్యక్షుల నియామకంతో పాటు మండల కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని పీసీసీ ఆదేశించింది. బీఎల్ఏల వివరాలను డీసీసీల ద్వారా కలెక్టర్లకు చేరవేయాలని నేతలకు స్పష్టమైన సూచనలు జారీ చేశారు.

# తెలంగాణలో జూన్‌లో సర్ ప్రారంభం

మొదటి తరువాయి

ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేరుస్తారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 - 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు. 2002లో రాష్ట్రంలో సర్ చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఈఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా రాబోయే సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్ల మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

# బంగారం ధరల్లో పతనం


మొదటి తరువాయి

ధర రూ.1,57,080గా, 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,44,000గా ఉంది. ముంబైలో 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,930కు చేరుకోగా 22 క్యారెట్ల వెండి ధర 1,43,850కు చేరింది. దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో కిలో వెండి ధర రూ.3 లక్షల మార్కు దిగువకు చేరుకుంది. చెన్నైలో గరిష్ఠంగా కిలో వెండి రూ.2.9 లక్షల వద్ద ట్రేడవుతోంది. ఇదిలావుంటే భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ శుక్రవారం ఒక దశలో 50 పైసలు క్షీణించి రూ.96.14కు చేరుకుంది. డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు రూ.96 మార్క్‌ను దాటడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలతోపాటు అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరగడం, డాలర్ బలోపేతం, దేశీయంగా ధరలు మరింత ఎగబాకవచ్చన్న ఆందోళనలు ఇందుకు ప్రధాన కారణమయ్యాయి. అయితే, ఆర్‌బీఐ జోక్యంతో రూపాయి మళ్లీ కాస్త కోలుకుంది. దాంతో డాలర్‌తో మారకం రేటు 17 పైసల నష్టంతో రూ.95.81 వద్ద ముగిసింది. ఇది కనిష్ఠ ముగింపు స్థాయి కూడా. గురువారం సెషన్‌లో డాలర్‌తో రూపీ మారకం రేటు 2 పైసలు లాభపడి రూ.95.64 వద్ద క్లోజైంది. అంతర్జాతీయంగా ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ ఇండెక్స్ 0.34 శాతం పెరిగి 99.15 స్థాయిలో ట్రేడైంది. బ్రెంట్ ముడి చమురు బ్యారల్ ధర ఒక దశ లో 3.14 శాతం పెరిగి 109.04 డాలర్లకు చేరుకుంది. 6 రోజుల్లో 2 శాతం డౌన్: గడిచిన 6 ట్రేడింగ్ సెషన్లలో డాలర్‌తో రూపాయి మారకం విలువ దాదాపు 2 శాతం క్షీణించిందిద

# భానుడి భగభగ

**-మళ్లీ 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు**
**-ఆదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీలు**
**-గాలిలో తగ్గిన తేమ శాతం...ఉక్కపోతతో అల్లాడుతున్న జనం**
**-పలు జిల్లాల్లో కురిసిన వర్షం**

హైదరాబాద్



రాష్ట్రంలో ఎండలు మండిపో తున్నాయి. మళ్లీ ఎండలు క్రమంగా పెరుగుతూ 45 డిగ్రీలకు చేరుతున్నాయి. శనివారం ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 44.8 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రాత్రి పూట కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకుపై నమోదవుతున్నట్లు గమనార్హం. మధ్యా హ్నం పూట వేడిగాల్పులు కూడా వీస్తున్నాయి. సాయంత్రం పూట కాస్త ఎండ తగ్గినప్పటికీ ఉబ్బరింపు అలాగే ఉంటున్నది. తీవ్ర ఉబ్బరంతో ఇండ్లలో ఉండలేని పరిస్థితి. అన్ని జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నమోదు అవుతుండటంతో వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. వచ్చే రెండు రోజుల్లో కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో 45 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉండటంతో ఆ జిల్లాలకు తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి పూట ఉష్ణోగ్రతలు కూడా 30 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అత్యధికంగా 31.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రామగుండం, కొత్తగూడెం, హైదరాబాద్ జిల్లాల్లోనూ కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. వేగంగా విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయి.

# లొంగిపోయిన బండి భగీరథ్!

హైదరాబాద్

తెలంగాణతోపాటు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన బండి భగీరథ్ కేసు కీలక మలుపు తిరిగింది. మధ్యంతర బెయిల్ ఈ దశలో ఇవ్వలేమని హైకోర్టు చెప్పడంతో బండి భగీరథ్ శనివారం రాత్రి పోలీసుల ఎదుట లొంగిపోయారు. పేట్ బషీరాబాద్ పోలీసులకు ముందస్తు సమాచారం ఇచ్చి వారి ఎదుట సరెండర్ అయ్యారు. బండి భగీరథ్ కేసులో రాత్రి నుంచి నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ పెద్దరికంతో వ్యవహరించి కుమారుడిని తీసుకొచ్చి అప్పగించాలని రేవంత్ రెడ్డి కామెంట్స్ చేశారు. తర్వాత కాసేపటికే హైకోర్టు కూడా ఆయనకు ముందస్తు బెయిల్ పై వచ్చే వారం తీర్పు ఇస్తామని పేర్కొంది. ఈ రెండింటిపై చర్చ జరుగుతున్న టైంలోనే బండి భగీరథ్ దేశం విడిచి వెళ్లిపోకుండా ఉండేందుకు పోలీసులు లుకౌట్



నోటీసుల జారీ చేశారు. మరోవైపు ఆయన కోసం పోలీసులు టీమ్లుగా ఏర్పడి హైదరాబాద్, ఢిల్లీ, కరీంనగర్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. చివరకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఇంటిలో కూడా పోలీసులు సోదాలు నిర్వహించారు. ఇలా అన్ని వైపుల నుంచి లాక్ చేశారు. దీంతో ఆయన లొంగిపోవాల్సి వచ్చింది. ఆయన్ని అరెస్టు చేసిన తర్వాత పోలీసులు కేసుకు సంబంధించిన వివరాలు ప్రకటించే అవకాశం ఉంది. మే 8వ తేదీన కేసు నమోదు అయినప్పటి నుంచి ఈ కేసు అనేక రకాల మలుపు తిరుగుతూనే ఉంది. అప్పటి నుంచి బండి భగీరథ్ పరారీలో ఉన్నారు. పోలీసు విచారణకు రావడానికి సమయం కోరారు. ఇంతలో ముందస్తు బెయిల్ వస్తుందని ప్రయత్నించారు. ఆ ప్లాన్ వర్కౌట్ కాకపోవడంతో ఇప్పుడు లొంగిపోయారు. మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో భగీరథ్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు 17 ఏళ్ల బాలిక ఫిర్యాదు మేరకు మే 8న కేసు నమోదయ్యింది. పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12లతో పాటు బీఎన్ఎస్ లోని 74, 75 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ విచారణ సాగుతున్న సమయంలోనే తనను బ్లాక్ మెయిల్ చేసి ఫిర్యాదురాలి కుటుంబం డిమాండ్ చేసిందని బండి భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేశారు.

# మోడీ నిర్ణయం, సామాన్యుల నడ్డి విరచడమే

హైదరాబాద్

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని సీఎం అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న



హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని... ఇప్పుడు ఆ పతనం పరాకాష్టకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోడీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోడీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోడీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని... ఇది విశ్వాస ఘాతకం అవుతుందని, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

న్యూఢిల్లీ:

పొరుగు దేశం పాకిస్తాన్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ, భారత్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు కొనసాగిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఒకవేళ తీవ్రవాదులకు ఆశ్రయం కల్పించి భారత్‌పై ప్రయోగిస్తే చరిత్రలో ఉంటారో లేదో పాక్ డిసైడ్ చేసుకోవాలని అన్నారు. ఢిల్లీలోని మానెక్షా సెంటర్‌లో 'యూనిఫామ్ అన్‌వీల్డ్' నిర్వహించిన ఒక ఇంటరాక్టివ్ సెషన్‌లో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పాల్గొన్నారు. గతేడాది ఆపరేషన్ సింధూర్‌కు దారితీసిన పరిస్థితులు మళ్ళీ తలెత్తితే భారత సైన్యం ఎలా స్పందిస్తుందని ఆయనను ప్రశ్నించగా ధీటుగా బదులిచ్చారు. పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఇటీవలే ఏడాది పూర్తైంది. ఆపరేషన్ సింధూర్ మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకున్న కొద్ది రోజుల తర్వాత సేనా సంవాద్ కార్యక్రమంలో భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదం పెంచి పోషిస్తే ఊరుకోబోమని పాకిస్తాన్‌కు గట్టి సందేశాన్ని ఇచ్చారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశ వైఖరిని పునరుద్ఘాటించారు. అయితే గతంలోనూ ఆపరేషన్ సింధూర్ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది. ఆపరేషన్ సింధూర్ త్రివిధ దళాల సమన్వయానికి నిదర్శనమని కొనియాడారు. భద్రతా సవాళ్లను




ఎదుర్కోవడంలో భారత సైనిక సన్నద్ధత ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌ను చాలా కచ్చితత్వంతో అమలు చేశామని చెప్పారు. 88 గంటల పాటు సాగిన ఆ ఆపరేషన్‌లో భారత త్రివిధ దళాలు అత్యంత సమర్థవంతంగా పనిచేశాయని గుర్తు చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా పాక్, పీఓకేలోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేయగలిగామని పేర్కొన్నారు. దాదాపు 100 మంది ఉగ్రవాదులను హతమార్చామని వెల్లడించారు. ఆ సమయంలో పెద్దఎత్తున బలగాలను సరిహద్దులకు తరలించామని వివరించారు. పాకిస్తాన్ చిన్న తప్పు చేసినా భూతల దాడులను ప్రారంభించేందుకు కూడా అప్పట్లోనే తాము పూర్తి సన్నద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు సున్నితంగా ఉన్నా ప్రస్తుతం అవి నియంత్రణలోనే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కాగా, గతేడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో అమాయక పర్యటకులపై ముష్కరులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో 26 మంది టూరిస్టులు మరణించారు. ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా గతేడాది మే 7వ తేదీ తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది భారత్. పాకిస్తాన్, పీఓకేలోని పలు ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు చేసింది. దాదాపు 100 మంది ముష్కరులను మట్టుబెట్టింది. దీంతో భారత్-పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఆపరేషన్ సింధూర్ తర్వాత భారత సైనిక స్థావరాలు, పౌర నివాసాలను లక్ష్యంగా చేసుకుని పాక్ దాడులకు ప్రయత్నించింది. ఆ దాడులను భారత్ సమర్థవంతంగా అడ్డుకుంది. తీవ్ర ప్రతి దాడులకు దిగి పాక్‌కు చుక్కలు చూపించింది. అత్యంత కచ్చితత్వంతో పాక్‌లోని దాదాపు డజను సైనిక స్థావరాలను నేలమట్టం చేసింది. అందులో పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ ఉన్న నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో పాటు సర్గోధా, భోలారీ వైమానిక స్థావరాలు కూడా ఉన్నాయి. దాడుల్లో అవి ధ్వంసమైన తీరు ఉపగ్రహ చిత్రాల్లో కనిపించింది. ఆ తర్వాత మే 10న ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ల మధ్య ప్రత్యక్ష చర్చలు జరిగాయి. దీంతో భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలో భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తగ్గాయి. అయినప్పటికీ పలు వేదికలపై భారత్‌పై యుద్ధంలో తామే గెలిచామని పాక్ ప్రగల్భాలు పలికింది. వాటిని కూడా భారత అధికారులు సమర్థంగా తిప్పికొట్టారు.

# డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ టాప్

మొదటి తరువాయి

సేవలపై ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడన్నారు. ది హేగ్ నగరం భారత్- నెదర్లాండ్స్ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. ఎన్నో కష్టాలను దాటుకుని అక్కడ స్థిరపడిన భారతీయ కుటుంబాల కథలు కేవలం వలసల కథలు కావని, అవి అభివృద్ధి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకలని అన్నారు. తరాలు మారినా, దేశాలు మారినా భారతీయ కుటుంబ విలువలు, సంస్కృతి మారలేదని కొనియాడారు. డచ్ భాషను స్వీకరించినా తమ మూల భాషలను, సంప్రదాయాలను ప్రవాస భారతీయులు వదల్లేదని అభినందించారు. ప్రపంచం ప్రస్తుతం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని ప్రధాని మోదీ అన్నారు. ముందుగా కరోనా మహమ్మారి వచ్చిందని, ఆ తర్వాత యుద్ధాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ఇంధన సంక్షోభం ప్రపంచాన్ని వేధిస్తోందని తెలిపారు. ఈ దశకం ప్రపంచానికి డిజిటల్ దశకంగా మారుతోందని వ్యాఖ్యానించారు. పరిస్థితులు త్వరగా మారకపోతే గత ఎన్నో దశాబ్దాల అభివృద్ధి ఫలితాలు చెదిరిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రపంచ జనాభాలో పెద్ద వర్గం పేదరికంలోకి జారిపడే పరిస్థితి రావచ్చుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచ దేశాలు రెసిలియంట్ సప్లై చైన్ పై దృష్టి పెడుతున్నాయని ప్రధాని తెలిపారు. భారత్, నెదర్లాండ్స్ కలిసి విశ్వసనీయమైన, పారదర్శకమైన, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సరఫరా వ్యవస్థను రూపొందించేందుకు కృషి చేస్తున్నాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం కోసం రెండు దేశాల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని వెల్లడించారు. 21వ శతాబ్దంలో



భారత్ అవకాశాల భూమిగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఒకేసారి టెక్నాలజీ ఆధారిత దేశంగా, మానవీయ విలువలను కాపాడే దేశంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్ ఎంత పురాతనమో, అంత ఆధునికంగా కూడా మారుతోందని వ్యాఖ్యానించారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం దేశంలో నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పారు. స్టార్టప్ రంగంలోనూ భారత్ వేగంగా ఎదుగుతోందని, ఒకప్పుడు కేవలం యూనికార్న్ కంపెనీలు మాత్రమే ఉండగా ఇప్పుడు 100కు పైగా ఉన్నాయని వెల్లడించారు. సెమీకండక్టర్ రంగంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధాని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటికే సెమీకండక్టర్ ప్లాంట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, త్వరలో 'మేడ్ ఇన్ ఇండియా' చిప్‌లు ప్రపంచ మార్కెట్లో కనిపిస్తాయని తెలిపారు. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు వెళ్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ట పెరుగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ఏబీ సమ్మిట్, జీ20 సమావేశాలను భారత్ విజయవంతంగా నిర్వహించగలిగిందని పేర్కొన్నారు. ప్రపంచ సమస్యల పరిష్కారంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భారత ప్రజాస్వామ్య బలం గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ప్రస్తుతం దేశంలో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారని వెల్లడించారు. యూరప్ దేశాల మొత్తం జనాభాను కలిపినా 64 కోట్ల మంది ఉండరంటూ భారత ప్రజాస్వామ్య విస్తృతిని వివరించారు. ప్రపంచానికి ప్రజాస్వామ్యానికి భారత్ మాతృదేశమని పేర్కొన్నారు. మే 16 తేదీ తన జీవితంలో ప్రత్యేకమని ప్రధాని గుర్తు చేసుకున్నారు. 2014 మే 16న లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెలువడి దేశంలో స్థిరమైన మెజార్టీ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ప్రజల విశ్వాసమే తనకు అతిపెద్ద బలం అని పేర్కొన్నారు. 'నేను-నేను' నుంచి 'మనము' అనే మార్గాన్ని ఎంచుకున్నాను. మీ సంతోషమే నా సంతోషం, మీ అభివృద్ధి నా బాధ్యత అని అన్నారు. 13 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా, 12 సంవత్సరాలు ప్రధానమంత్రిగా ప్రజల మద్దతు పొందడం తన అదృష్టమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కోట్లాది భారతీయుల ఆశీర్వాదమే తనకు శక్తినిస్తోందని తెలిపారు.

# సంపాదకీయం

## ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !




నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్త రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్మూజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అననింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణ మవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబిం చాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

# బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం.

**-బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి..**
**-బీఆర్ఎస్ పార్టీలో భారీగా యువత చేరిక..**

**మెదక్ జిల్లా -16మే ( మహాప్రభ )**
పార్టీ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా నిలుస్తామని, కార్యకర్తల సంక్షేమం మరియు గౌరవ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి భరోసా ఇచ్చారు. రామాయంపేట పట్టణ రాజకీయాల్లో యువతలో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణకు నిదర్శనంగా ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో భారీగా యువకులు చేరారు.పట్టణానికి చెందిన సుమారు 50 మందికి పైగా యువకులు బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై తిరుపతిరెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకొని పార్టీలో అధికారికంగా చేరడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యువత పెద్ద సంఖ్యలో హాజరై తిరుపతిరెడ్డికి మద్దతుగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లో చైతన్యంతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. పార్టీ అభివృద్ధి కోసం



నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్తకు అన్ని వేళలా అండగా నిలుస్తామని, కార్యకర్తల సంక్షేమం మరియు వారి గౌరవాన్ని కాపాడేందుకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ వారికి పూర్తి మద్దతు అందిస్తామని తెలిపారు.యువతకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ...ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుపతిరెడ్డి నాయకత్వం తమను ఎంతో ఆకట్టుకుందని పేర్కొన్నారు. యువతకు అండగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిగా తిరుపతన్నకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.రామాయంపేట పట్టణ అభివృద్ధి, యువత ఉపాధి అవకాశాల కల్పన, సామాజిక సేవా కార్యక్రమాలు, అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలుస్తున్న తీరును చూసి తాము బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో తిరుపతిరెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట పట్టణానికి చెందిన మద్దూరి భానుచందర్, మార్కు సతీష్, సాగర్, ఎండి సల్మాన్, శ్రీకాంత్, దోమకొండ భాను, మెట్టు గణేష్, ఎరుపుల ప్రసాద్, గొల్లపర్తి ప్రసాద్, నువ్వుఆన్ సంజయ్, బన్నీ తదితర ముఖ్య నాయకులు, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూకట్పల్లిలో ఓట్ల తొలగింపు వివాదం

**-ఎమ్మెల్యే వ్యాఖ్యలపై**
**బండి రమేష్ ఘాటు విమర్శలు**

**కూకట్పల్లి, మే 16 (మహాప్రభ):**
కూకట్పల్లి నియోజకవర్గంలో 40 వేల ఓట్లు తొలగించారన్న ఎమ్మెల్యే కృష్ణారావు వ్యాఖ్యలపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారిక ప్రక్రియలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే భారీ సంఖ్యలో ఓట్లు తొలగించారని ఎమ్మెల్యే ఎలా ప్రకటించగలరని ఆయన ప్రశ్నించారు.
“అసలు ఎమ్మెల్యే గెలుపు మెజార్టీ ఈ దొంగ ఓట్లపైనే ఆధారపడి ఉందా?” అంటూ బండి రమేష్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గంలో అన్ని అభివృద్ధి పనులు తానే చేశానని చెప్పుకునే ఎమ్మెల్యే, ఇప్పుడు మళ్లీ పర్యటిస్తూ సమస్యలు గుర్తించడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆయన ఎద్దేవా



చేశారు. ప్రజా సమస్యలపై పాదయాత్ర మూసాపేట ఆంజనేయ నగర్‌లో స్థానిక నాయకులతో కలిసి శనివారం బండి రమేష్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రస్తావించిన త్రాగునీటి సమస్య, రహదారుల అభివృద్ధి, కమ్యూనిటీ హాలు, పార్కుల అభివృద్ధి, శాంతి భద్రతల వంటి పలు అంశాలపై అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులపై అక్రమ కార్ పార్కింగ్ సమస్యపై ట్రాఫిక్ అధికారులతో కూడా చర్చించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులపై హామీలు మూసాపేట వై జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి, జేఎన్‌టీయూ సమీపంలో స్కైవాక్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభమవుతాయని బండి రమేష్ తెలిపారు. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్ ఎన్నో సంవత్సరాలుగా బ్రిడ్జి కిందనే కొనసాగుతుండగా, దీనికి శాశ్వత స్థలం కల్పించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్ నాయకులు, సేవాదళ్ కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నెదర్లాండ్స్ రాజుతో మోదీ భేటీ

**సాంకేతికత, ఆవిష్కరణల్లో సహకారంపై చర్చలు**



**ది హేగ్,న్యూఢిల్లీ: మే 16 (మహాప్రభ):**
ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నెదర్లాండ్స్ రాజు విల్లెమ్ అలెగ్జాండర్, రాణి మాక్సిమాలతో అక్కడి రాయల్ ప్యాలెస్‌లో సమావేశం అయ్యారు. డిజిటల్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, బ్లూ ఎకానమీ తదితర రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారంపై వారు చర్చించారు.‘భవిష్యత్తుకు సిద్ధంగా ఉండే ప్రపంచాన్ని నిర్మించాలనే ఉమ్మడి విశ్వాసం, ఉమ్మడి ఆసక్తులతో భారత్, నెదర్లాండ్స్ అనుసంధానమై ఉన్నాయి’ అని ప్రధాని ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతకు ముందు రాజధాని హేగ్‌లో ప్రవాస భారతీయులతో ప్రధాని మోదీ మాట్లాడారు.

# ఇన్‌స్టాగ్రామ్ అమ్మాయిల కోసమే..

**సోషల్ మీడియాలో చర్చకు తెరలేపిన ఎలాన్ మస్క్..!**



**న్యూఢిల్లీ: మే 16(మహాప్రభ):**
సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ పై ప్రముఖ బిలియనీర్ ఎలాన్ మస్క్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ కేవలం అమ్మాయిల కోసమేనంటూ సోషల్ మీడియాలో చర్చకు తెరతీశారు. సోషల్ మీడియాలో ప్రజల అలవాట్లు, వారి జీవితంలోని వివిధ దశలు ఎలా ప్రతిబింబిస్తాయనే అంశంపై ఓ వైరల్ థ్రెడ్ నడుస్తోంది. అందులో ఫొటోలు పెట్టడం, రీల్స్ చేయడం, వంట ఫొటోలు షేర్ చేయడం వంటి పనులను ప్రస్తావిస్తూ జోకులు పేలాయి.ఈ చర్చలోకి ఎలాన్ మస్క్ ఎంటరయ్యారు. ఇన్‌స్టాగ్రామ్ అమ్మాయిల కోసమే అంటూ కామెంట్ చేశారు. అంతటితో ఆగకుండా ‘కొంతమంది మగవాళ్లు తమ ఇన్‌స్టా ప్రొఫైల్స్ నాకు పంపుతుంటారు. అప్పుడు నాకు వాళ్లేమైనా లింగమార్పిడి చేయించుకుంటున్నారా అనిపిస్తుంది’ అని మస్క్ వివాదాస్పద వ్యాఖ్య చేశారు. దాంతో ఆయనపై నెటిజన్‌లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి...




**రామాయంపేట మే 16 (మహాప్రభ):**
డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సెంటర్ సూపర్డెంట్ లింబాద్రి సూచించారు. శనివారం ప్రపంచ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి నీరు నిలవకుండా చూసుకోవాలని చెప్పారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వైశాలి, వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజు, వైద్య సిబ్బంది ఉన్నారు.

# పుచ్చకాయ తినగానే వ్యక్తి మృతి!

**అతడి కొడుకు పరిస్థితి విషమం**
**ఎంపీలో షాకింగ్ ఘటన**



**న్యూఢిల్లీ: మే 16 (మహాప్రభ):**
పుచ్చకాయను తిని అస్వస్థతకు గురైన ఘటనలో తండ్రి మృతి చెందగా, కొడుకు చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లా షియోపూర్‌కు చెందిన ఇంద్రకుమార్ పరిహార్ (43) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం కొడుకు వినోద్‌తో కలిసి పుచ్చకాయను తిన్నాడు. ఆ తర్వాత వారిద్దరూ అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వారిని షియోపూర్ దవాఖానకు తరలించారు.ఇంద్రకుమార్ పరిస్థితి విషమించడంతో కోటాకు తరలిస్తుండగా మృతి చెందాడు. వినోద్ పరిస్థితి విషమంగా ఉంది. జిల్లా దవాఖాన సివిల్ సర్జన్ డాక్టర్ ఆర్‌బీ గోయల్ మాట్లాడుతూ..పుచ్చకాయ తినడం వల్లే ఇంద్రకుమార్ మృతి చెందాడని ఇంకా నిర్ధారించలేదని తెలిపారు. అతడి కడుపునకు ఇన్‌ఫెక్షన్ సోకిందా అనేది తెలియాల్సి ఉన్నదన్నారు. పుచ్చకాయలో విష పదార్థం లేదా రసాయనాలు కలిశాయా అనేది పోస్ట్‌మార్టమ్ రిపోర్టు వచ్చాక తేలుతుందని ఉన్నతాధికారులు తెలిపారు.

# పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారాన్ని మోపి నడ్డి విరుస్తున్న కేంద్ర బీజేపీ సర్కార్

**పల్లా దేవేందర్ రెడ్డి**
**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి**





**దేవరకొండ మే 16( మహాప్రభ )**
శనివారం సిపిఐ దేవరకొండ మండల సమితి ఆధ్వర్యంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ పల్లా పర్వత్ రెడ్డి భవన్ నుండి ఐబీ, కోర్ట్, బస్ స్టాడ్ వరకు ఆటో కు తాళ్లుకట్టి లాగి నిరసన ర్యాలీతో వెళ్లి 167 జాతీయ రహదారిపైన ధర్నా నిర్వహించారుసందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూకేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పెట్రోల్ డీజిల్ పై విపరీతంగా ధరలు పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రతి ఎన్నికల సందర్భంగా మేము పెట్రోల్ డీజిల్ పై ఎటువంటి ధరలు పెంచమని అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజలను నమ్మిస్తూ ఎన్నికలు అయిపోయిన వెంటనే రేట్లు పెంచుతూ మోసం చేస్తున్నారు.అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగినాయి కాబట్టి ఇక్కడ కూడా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచుతున్నామని మాట్లాడుతున్న బిజెపి కేంద్ర సర్కార్ అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ తగ్గినప్పుడు ఎందుకు ఇక్కడ ధరలు తగ్గించలేదో సమాధానం చెప్పాలని అన్నారు. అమెరికా ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పైన మూకుమ్మడి దాడి చేసి ఆయిల్ పైన ఆధిపత్యం కోసం ప్రయత్నం చేస్తున్నారు.అమెరికా ఇజ్రాయిల్ దుర్మార్గాలను ఖండించాల్సిన భారత ప్రభుత్వం నిస్సిగ్గుగా ఇరాన్ కు వ్యతిరేకంగా ఉండటం మూలంగా ఆ దేశం తో ఉన్నటువంటి సంబంధాలు దెబ్బతిన్నాయి. విదేశాంగ విధాన నిర్ణయాలు తీసుకోవటంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది ఆయన అన్నారు. లౌక్యం లేకపోవడం అమెరికా పట్ల అత్యంత బానిసత్వంగా ఉండటం వల్ల దేశం నేడు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నది.ప్రపంచంలో ఉన్న అనేక దేశాలు వారి యొక్క విదేశాంగ విధానము ఇతర దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండటం వల్ల ఆయా దేశాలలో పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా ఉన్నది. ఇరాన్ పైన అమెరికా ఇజ్రాయిల్ దాడి కొనసాగిస్తున్నప్పుడు యుద్ధం వద్దు అని కమ్యూనిస్టు పార్టీలతో పాటు మిగతా ప్రగతిశీల పార్టీలు రోడ్ల మీదికి వచ్చి యుద్ధాన్ని ఆపాలని కోరినప్పుడు నకిలీ దేశభక్తులు అంధ భక్తులు బిజెపి నాయకులు కమ్యూనిస్టు పార్టీలపైన తప్పుడు ప్రచారం చేస్తూ ఇక్కడ ఉండి మీరు ఇరాన్ కు మద్దతు చేయడం ఏందని అత్యంత అవగాహన రాయిత్యంతో మాట్లాడటం జరిగింది అని తెలిపారు.ఎక్కడో యుద్ధం జరిగితే ఈ దేశానికి ఏం సంబంధం అని ప్రగల్భాలు పలికిన బిజెపి నాయకులు ఇప్పుడు ఇరాన్ లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు పశ్చిమాసియా యుద్ధ వాతావరణం కారణంగానే పెట్రోల్ డీజిల్ పెంచుతున్నామని చెప్పటం దివాళి కోరు తనానికి నిదర్శనం అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరిగినా దాని ప్రభావం అన్ని దేశాల పై ఉంటుంది. ఈ మాత్రం అవగాహన లేకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తూ బిజెపి కార్పొరేట్ దోపిడి అనుకూల విధానాలను తెస్తున్నది తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం.డీజిల్ పెట్రోల్ గ్యాస్ రేట్లు పెరగటం అంటే దాని యొక్క ప్రభావం నిత్యవసర వస్తువుల పై మొదలుకొని అన్ని రంగాలపై ఉంటుంది. ఇది ప్రత్యక్షంగా ప్రజలపై భారాన్ని మోపటమేనని అన్నారు. శ్రమను నమ్ముకుని బతుకుతున్న ప్రజల అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాదిమంది ప్రజలు కనీస వేతనం పొందలేని పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. ధరల పెరగటం మూలంగా వారి రోజువారి జీవితాన్ని ప్రమాదంలోకి నెడుతున్నది.భవిష్యత్తులో పెట్రోల్ ,డీజిల్ సిలిండర్ ధరలు మరింతగా పెంచి ఆయిల్ కంపెనీలకు దోచిపెట్టడానికి ఈ దేశ పాలకవర్గం సిద్ధంగా ఉన్నది అని అన్నారు. ఈ యొక్క నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం మాత్రమే ప్రజలను రక్షిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి వలమల్ల ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు పల్లా రంగారెడ్డి, జూలూరి వెంకట్రాములు, నీలా వెంకటయ్య, ఎండి మైనొద్దీన్,గంగిడి రాంరెడ్డి,కిన్నెరా యాదయ్య,మహిళ సమాఖ్య డివిజన్ అధ్యక్షురాలు లింగంపల్లి అనిత, శాఖ కార్యదర్శులు, మండల కౌన్సిల్ సభ్యులు జూలూరి జ్యోతిబస్, తోటపల్లి నగేష్, జక్క మాధవరెడ్డి,అలామోని మల్లయ్య,కిన్నెరా భారీముల,బొడ్డుపల్లి అంజయ్య, సంకెపల్లి మోహన్ రెడ్డి, మావిళ్ల వెంకటయ్య,గంగలి పర్వతాలు,ఏషామోని మల్లేష్,ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, నాయకులు జక్క కృష్ణారెడ్డి,ముదిగొండ సైదులు, నాంపల్లి రాజమల్లయ్య,రేణిగుంట శ్రీనివాస్,ఎండి జాకీర్,పి యాదగిరి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టమే విజయానికి మెట్టు...
## కొత్త సంస్థలో కీలక బాధ్యతలు చేపట్టనున్న సంతోష్



**హైదరాబాద్, మే 16 (మహ ప్రభ):** తన కృషి, పట్టుదల, నిబద్ధతతో కెరీర్‌లో మెట్టు మెట్టుగా ఎదిగిన సంతోష్ మరో నూతన సంస్థలో కీలక బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఎక్కడ పనిచేసినా సంస్థ అభివృద్ధి మాత్రమే కాకుండా, సహచరులకు ప్రేరణగా నిలవడం ఆయన ప్రత్యేకతగా మారింది. చిన్ననాటి నుంచే కష్టపడి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగిన సంతోష్ తన ప్రయాణాన్ని న్యూస్‌పేపర్ పంపిణీతో ప్రారంభించారు. సాధారణ స్థాయి నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు మేనేజ్‌మెంట్ స్థాయికి చేరడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. అనంతరం హిందుస్థాన్ కంపెనీ, మెట్రో క్యాష్ అండ్ క్యారీ, ఐక్య ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జూడియో వంటి ప్రముఖ సంస్థల్లో సేవలందిస్తూ తన ప్రతిభను చాటుకున్నారు. ప్రతి సంస్థలో ఆయన నాయకత్వం అభివృద్ధికి దోహదపడగా, వందలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించి సామాజిక బాధ్యతను కూడా చాటుకున్నారు. సంస్థ అభివృద్ధి మాత్రమే కాదు, ఉద్యోగుల సంక్షేమం, యువతకు మార్గదర్శనం చేయడం సంతోష్ నాయకత్వానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. కొత్త సంస్థలో ఆయన సేవలు మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించి, విజయానికి కొత్త దిశ చూపిస్తాయని సహచరులు, స్నేహితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## సమయపాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

-అప్రమత్తతతో విధులు నిర్వహించాలి
-పరేడ్‌ను పరిశీలించిన మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్.



**మెదక్ జిల్లా -16మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన వారాంతపు పరేడ్‌ను మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది పరేడ్‌లో పాల్గొని డ్రిల్ నిర్వహించారు. సిబ్బంది టర్నౌట్, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆయుధాల నిర్వహణ విధానాన్ని డీఎస్పీ పరిశీలించి పలు సూచనలు చేశారు.
ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. శారీరక దృఢత్వం కోసం ప్రతి రోజు వ్యాయామం, డ్రిల్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను కాపాడే విధంగా సిబ్బంది నడుచుకోవాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు లింగం, నరేష్, సుభాష్, భవాని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గోవుల తరలింపు.. లారీ సీజ్

-ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**మెదక్ జిల్లా, మే 16,(మహ ప్రభ)** అక్రమంగా గోవులను తరలిస్తున్న లారీని గోరక్షక్ కార్యకర్తలు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మాసాయిపేట మండలంలో చోటుచేసుకుంది. శనివారం ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు గోవులను తరలిస్తున్న లారీని, ముందస్తు సమాచారం మేరకు గోరక్షక్ కార్యకర్తలు మాసాయిపేట మండలం రామంతాపూర్ హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని డబ్బా వద్ద అడ్డగించారు. సమాచారం అందుకున్న చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి వెంటనే ఘటన స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం లారీని పోలీసులు సీజ్ చేశారు. లారీలో ఉన్న సుమారు 30 గోవులను సురక్షితంగా గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## వరి కొనుగోలు కేంద్రంలో పరీక్షిస్తున్న డిఆర్డిఏ, ఏపీడి విజయలక్ష్మి



**గాంధారి, మే 16(మహాప్రభ)**
వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ గాంధారి మండలం, సీతాయిపల్లి, మేడిపల్లి వరి కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డిఆర్డిఏ ఏపీడి విజయలక్ష్మి,మాట్లాడుతూ...వరిలో తేమ శాతాన్ని పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. తూకం ప్రక్రియను వేగవంతం చేసి ధాన్యం బస్తాలను త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఏపిఎం ప్రసన్నకుమార్, సీసీలు గొర్రె రాములు, రమేష్ రాథోడ్ కాశీనాథ్ గౌడ్, వివోఏలు పుష్పలత, పఠాన్ గౌస్ ఖాన్, ట్యాబ్ ఆపరేటర్ పండగ భూమన్న, రైతులు తిరుపతి, శివరాజు, జ్యోతి, తదితరులు ఉన్నారు.

## జనగణన ప్రక్రియలో అందరూ భాగస్వాములు కావాలి

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -16మే ((మహాప్రభ).**
జనగణన 2027లో భాగంగా సమగ్ర, ఖచ్చితమైన గణాంకాల రూపకల్పనలో జనగణన కీలకమని, జనాభా గణన, గృహ బాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట్ గ్రామంలో జనగణన 2027 ఇండ్ల లెక్కింపు కార్యక్రమాన్ని ఆర్డిఓ రమాదేవి ,తాసిల్దార్ ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి, హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే) ప్రక్రియను కలెక్టర్ స్వయం గా పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన వివరాలను అందించాలని సూచించారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయని..ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించడం జరిగిందన్నారు జనగణన ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, జనగణనలో భాగస్వామ్యులు అయ్యే బాధ్యత ప్రతీ ఒక్కరికీ ఉందన్నారు ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్ రజిని, ఎంపీడీవో, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య...



**పాపన్నపేట మే16( మహాప్రభ)**
జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన మండల పరిధిలోని పోడ్చన్ పల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...గ్రామానికి చెందిన వడ్ల సత్యనారాయణ(55) గత కొన్ని రోజులుగా ఫిట్స్, బ్యాక్ పెయిన్ తో బాధపడుతూ ఇంటి వద్దే ఉంటున్నాడు.పని చేయుటకు శరీరం సహకరించడం లేదని తరచూ ఇంట్లో బాధపడుతుండే వాడు.ప్రతి రోజు లాగే శనివారం మధ్యాహ్నం సమయంలో భోజనం చేసి గదిలోకి వెళ్లాడు.జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.కాసేపటికి గమనించిన కుటుంబీకులు కొన ఊపిరితో ఉన్న అతన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా అక్కడ డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు.మృతుడి భార్య నీరజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## నాయుడుపేటలో బడి పిలుస్తోంది కార్యక్రమంపై ర్యాలీ

-పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**మే 16 తిరుపతి జిల్లా (నాయుడుపేట) మహాప్రభ**
నాయుడుపేట ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి, కార్పొరేట్ బడులకు ధీటుగా విద్యా ప్రమాణాలను అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "బడి పిలుస్తోంది" కార్యక్రమం శనివారం నాయుడుపేట పట్టణంలో నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ నేతృత్వంలో నాయుడుపేట పట్టణంలోని ఎల్.ఎ. సాగరం నుండి ఆర్టీసీ సర్కిల్ వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి మండల విద్యాశాఖాధికారి మరియు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బడులలో నాణ్యమైన విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు మరియు తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలను అందిస్తోందని గుర్తుచేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను కనీసం 10 శాతం పెంచడమే లక్ష్యంగా ప్రచార రథాలు, ఇంటింటి ప్రచారాల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. దివ్యాంగులు మరియు బడికి దూరమైన పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించాలని, 100% విద్యార్థుల నమోదు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు

లైన్మెన్‌కు పలుమార్లు చెప్పినా స్పందన లేదని రైతు ఆవేదన



**తాడ్వాయి మే 16 (మహాప్రభ)**
తాడ్వాయి మండలం కన్కల్ గ్రామానికి చెందిన గడ్డం సంతోష్ రెడ్డి, తన వ్యవసాయ చేనులో గత కొన్ని రోజులుగా విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనులో పనులు చేస్తున్న సమయంలో వైర్లు మనిషికి తగిలే స్థాయిలో ఉండటంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు.ఈ విషయాన్ని స్థానిక లైన్మెన్‌కు పలుమార్లు తెలియజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రైతులు, కూలీలు చేనులోకి వెళ్లేందుకు భయపడుతున్నారని చెప్పారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి వైర్లను సరిచేసి ప్రమాదాన్ని నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## జిల్లా న్యాయ సేవాదికార సంస్థ ఆధ్వరంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్కీమ్ పై అవగాహన.




**మెదక్ జిల్లా -16మే (మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.నీలిమ సూచనల మేరకు శనివారం రోజున మెదక్ మండల పరిధిలోని శివాయపల్లి గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్కిమ్స్ పై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ కరుణాకర్ మాట్లాడుతూ ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సమాజంలోని పేదలు, మహిళలు, వృద్ధులు, పిల్లలు మరియు అర్హులైన వారికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్కీమ్ ద్వారా పేదలు, మహిళలు, పిల్లలు, వృద్ధులు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించడం, బాధితులకు చట్టపరమైన రక్షణ కల్పించడం కూడా ఈ స్కీమ్స్ లక్ష్యం అన్నారు. అందరం కలిసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినిత భాస్కర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు చందు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన అన్లోడింగ్ చేయాలి

-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.



**మెదక్ జిల్లా -16మే, (మహాప్రభ ).**
ధాన్యాన్ని త్వరితగతిన అన్లోడింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మిల్లర్లను ఆదేశించారు. ఘన్పూర్ మండలంలోని పలు రైస్ మిల్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. రైస్ మిల్లర్లు అన్లోడింగ్ ప్రక్రియ స్పీడ్ అప్ చేయాలని, హమాలీల కొరత లేకుండా చూడాలని, అధికారుల ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా తక్షణమే ధాన్యం దిగుమతి చేపట్టి, తూకం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అకాల వర్షాల సంభవిస్తే రైతులు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్లు, నిల్వ సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం అన్‌లోడింగ్‌లో ఆలస్యం జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితో తదితరులు పాల్గొన్నారు.

## మెగా మెడికల్ క్యాంపుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆహ్వానించిన యలమంచి ఉదయ్ కిరణ్



**శేరిలింగంపల్లి, మే 16 (మహాప్రభ )**
మియాపూర్ బీకే ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న మెగా మెడికల్ క్యాంపు కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ మరియు ఇన్ఫర్మేషన్ ‌ఁ పబ్లిక్ రిలేషన్స్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మరియు చైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కి ఆహ్వాన పత్రికను అందజేశారు. సమాజంలోని ప్రతి వర్గ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సూచనలు, అవసరమైన మందులు మరియు ఇతర వైద్య సేవలను ప్రజలకు అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. సమాజ సేవలో భాగంగా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు , శరత్ , రాధాకృష్ణ , ప్రవీణ్ , వంశీ , శివ మరియు ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమ విజయవంతానికి తమ పూర్తి సహకారాన్ని అందించారు.

## డ్వాక్రా మహిళా సంఘాలకు న్యాయ విజ్ఞాన సదస్సు



**శివంపేట మే 16 (మహాప్రభ):**
శివంపేట మండలం పెద్ద గొట్టిముక్కల గ్రామంలో డాక్రా మహిళా సంఘాలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సహాయ న్యాయవాది డి. శ్రీధర్ రెడ్డి, లీగల్ సర్వీస్ న్యాయవాది కార్తీక్ రాజ్ పాల్గొన్నారు. మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాలల హక్కులు, మహిళలకు అందే న్యాయ సహాయం, ప్రభుత్వ పురస్కారాల పై అవగాహన కల్పించారు.

# కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని పలు మార్లు మిల్లర్లకు ఆదేశాలు.

-ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిని పెడుతున్న మిల్లర్లు రైతులకు తీవ్ర ఇబ్బందులు.
-రెండు రైస్ మిల్లులు బ్లాక్‌లిస్ట్.
--పాపన్నపేట మండలం మేసర్స్ శ్రీ సాయి లక్ష్మీ ట్రేడర్స్, రామాయంపేట్ మేసర్స్ భవాని ఇండస్ట్రీస్, పై చర్యలు.
-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -16మే (మహాప్రభ ).**
ధాన్యం దిగుమతులలో అలసత్వం వహించిన మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. రబీ మార్కెటింగ్ సీజన్ 2025-26 (యాసంగి) సందర్భంగా జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించేందుకు అన్ని రైస్ మిల్లర్లు పీపీసీల నుండి ధాన్యాన్ని దిగుమతి చేసుకొని కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని పలు మార్లు ఆదేశాలు జారీ చేయబడ్డాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. కొనుగోలు కేంద్రాల ధాన్యం దిగుమతులపై కలెక్టర్ మాట్లాడుతూ కష్టం మిల్లింగ్ ఆపరేషన్లో తప్పనిసరిగా పాల్గొనాలని పలుమార్లు వెల్లడించిన మిల్లర్లు ఆ మాటలు పెడచెవిని పెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీని దృష్టిలో పెట్టుకుని మేసర్స్ శ్రీ సాయి లక్ష్మీ ట్రేడర్స్, పాపన్నపేట మండలం మరియు మేసర్స్ భవాని ఇండస్ట్రీస్, రామాయంపేట్ వారు పీపీసీల నుండి కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ప్రభుత్వ ఆదేశాలను పాటించకపోవడం గమనించబడినది. దీనివల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి మరియు ధాన్యం కొనుగోలు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో, సంబంధిత జి.ఓ నిబంధనల ప్రకారం పై రైస్ మిల్లులను పాడి ప్రొక్యూర్‌మెంట్ మరియు కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్ నుండి తక్షణ ప్రభావంతో బ్లాక్ / బ్లాక్‌లిస్ట్ చేయడం జరిగినది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా రైస్ మిల్లులకు ఎటువంటి ధాన్యం కేటాయింపు చేయబడవని వెల్లడించారు. అలాగే, జిల్లాలోని అన్ని రైస్ మిల్లర్లు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటిస్తూ పీపీసీల నుండి ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని, లేనిపక్షంలో సంబంధిత రైస్ మిల్లులపై కూడా కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# కృత్రిమ మేధస్సుతో విద్య- పరిపాలన సులభతరం

- ప్రొఫెసర్ ప్రశాంత్ దేశాయ్.



**మెదక్ మే 16 (మహాప్రభ):**
కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ )వినియోగం ద్వారా విద్య, వైద్యం, పరిపాలన, పరిశోధన వంటి అనేక రంగాలు మరింత సులభతరం, వేగవంతం అవుతాయని ప్రొఫెసర్ ప్రశాంత్ దేశాయ్ పేర్కొన్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు అయిన శనివారం "కృత్రిమ మేధా అవగాహన మరియు ఆవిష్కరణలు" అనే అంశంపై వివిధ కార్యక్రమాలు నిర్ణయించబడింది. అందులో భాగంగా కళాశాల ఐక్యూ ఏసి విభాగం ఆధ్వర్యంలో "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అవగాహన మరియు ఆవిష్కరణలు" అనే అంశంపై 'అల్ అన్ లాక్ డ్ -హింద్స్ ఆన్ విత్ ది టూల్స్ షేపింగ్ టుమారో' శీర్షికతో ఒకరోజు కార్యశాల నిర్వహించబడింది. ఈ కార్యశాలకు బీవీఆర్ఐటీ నర్సాపూర్‌కు చెందిన సహాయ ఆచార్యులు ప్రొఫెసర్ ప్రశాంత్ దేశాయ్ గారు రిసోర్స్ పర్సన్‌గా హాజరై, వివిధ ఎ యల్ టూల్స్ వినియోగం మరియు వాటి ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. అదేవిధంగా, విద్య మరియు పరిపాలన రంగాల్లో కృత్రిమ మేధస్సు వినియోగం ద్వారా పనుల నిర్వహణ మరింత వేగవంతం, ఖచ్చితత్వం మరియు సమర్థతతో సాధ్యమవుతుందని, భవిష్యత్ విద్యా వ్యవస్థలో ఎ యల్ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య హుస్సేన్ ప్రారంభించి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నేటి డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తోంది. బోధన, పరిశోధన, పరిపాలన రంగాలలో ఎ యల్ వినియోగం ద్వారా పనితీరు మెరుగుపడటంతో పాటు సమయాన్ని ఆదా చేయవచ్చు. అధ్యాపకులు ఈ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించి విద్యార్థుల అభ్యాసాన్ని మరింత సమృద్ధిగా చేయాలి" అని సూచించారు. ఈ కార్యశాలకు కళాశాల ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. తిరుమల్ రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ. సింహా రెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. శరత్ రెడ్డి, సీనియర్ అధ్యాపకులు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి అంజద్ అలీ మరియు ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యా వారోత్సవాలలో భాగంగా ఐదవ రోజు అయిన శుక్రవారం "గ్రంథాలయాలు -- జ్ఞానాలయాలు" అనే అంశంపై పుస్తక ప్రదర్శన, పుస్తక రచయితల సన్మానం, గ్రంథాలయ సందర్శన వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాలకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో పుస్తక రచన చేసిన అధ్యాపకులు డాక్టర్ ఎన్. తిరుమల్ రెడ్డి, డాక్టర్ కె. నాగేంద్రరావు, డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఆర్. శ్రీలత, డాక్టర్ ఆర్. సుధాకర్ లను సన్మానించారు.

## సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతున్న ఆవుల రాజిరెడ్డి

-ఉచిత మెగా కంటి శిబిరం నిర్వహణ
-800 మందికి పైగా ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు





**శివంపేట మే 16 (మహాప్రభ):**
మెదక్ జిల్లాఎల్దుర్తి మండల కేంద్రంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి శిబిరం ఘనంగా జరిగింది. బాలాజీ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించింది. శిబిరానికి హాజరైన ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు వైద్యులు ప్రత్యేక సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచిత అద్దాలు కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరాన్ని గ్రామ ప్రజలు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో వినియోగించుకోగా, 800 మందికి పైగా లబ్ధి పొందారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు కొండంత అండ

- సర్పంచ్ ప్రవీణ్ గౌడ్




**శివంపేట, మే 16(మహాప్రభ):**
మెదక్ జిల్లా శివంపేట మండలం పరిధిలోని చెంది గ్రామంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. సర్పంచ్ ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సహకారంతో మేయర్ ప్రశాంత్ మరియు అఖిలా రెడ్డికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను ఉప సర్పంచ్ సౌజన్య నరేష్‌తో కలిసి అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనివాస్ గౌడ్, అబ్దుల్ లతీఫ్, ఆంజనేయులు, రాజు, అనిల్, ప్రవన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామాభివృద్ధి పనులపై గ్రామసభలు నిర్వహించి, తీర్మాన పుస్తకాల్లో నమోదు చేసి పనులు పారదర్శకంగా చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

## రామాయంపేట మున్సిపల్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి మద్దతుగా నిలుస్తున్న ఏడో వార్డ్ కౌన్సిలర్ .గాజవాడ నాగరాజు



**రామాయంపేట మే 16 మహాప్రభ**
రామాయంపేట మున్సిపాలిటీలో గత 11 నెలలు గా పెండింగ్లో ఉన్న మున్సిపల్ సిబ్బంది నిధులను మున్సిపల్ నుండి విడ్రా చేసి వాటిని సిబ్బంది ఖాత లో జమ చేయకుండా మున్సిపల్ అధికారులు దుర్వినియోగం చేశారని ఇట్టి విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్.గజవాడ నాగరాజు మరియు పట్టణ అధ్యక్షుడు చింతల స్వామి. కాంగ్రెస్ పార్టీ నాయకులకు దాకి స్వామి డిసిసి కార్యదర్శి పోచమ్మ గణేష్ .మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి వెంటనే ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి మరియు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని పెండింగ్లో ఉన్న 11 నెలల పిఎఫ్ నిధులను సిబ్బంది ఖాతాలో జమ చేయించి. అవినీతికి పాల్పడిన అధికారులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి తగిన న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా చూస్తామని వారు తెలిపారు.

# బిజినెస్

## మహారాష్ట్రలో బైక్, ట్యాక్సీలు రద్దు..!




**ముంబయి**

మహారాష్ట్రలో చట్టవిరుద్ధంగా బైక్ ట్యాక్సీ సేవలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలతో ఓలా, ఉబర్, ర్యాపిడో మొబైల్ యాప్‌లపై అక్కడి ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ సంస్థలు మోటార్ వాహనాల నిబంధనలను పాటించకుండా.. ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా బైక్ రైడింగ్ సేవలను అందిస్తున్నాయని పేర్కొంటూ మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ సైబర్ విభాగానికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తమ యాప్ స్టోర్స్ నుండి ఈ మూడు యాప్స్‌ను వెంటనే తొలగించాలంటూ మహారాష్ట్ర స్టేట్ సైబర్ డిపార్ట్‌మెంట్ గూగుల్, యాపిల్ సంస్థలకు అధికారికంగా నోటీసులు జారీ చేయడంతో రాష్ట్రంలో క్యాబ్, రైడ్ సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. గతంలో కర్ణాటక ప్రభుత్వం కూడా మోటార్ వెహికల్ చట్టంలో బైక్ ట్యాక్సీల ప్రస్తావన లేదనే కారణంతో హైకోర్టు ఆదేశాల మేరకు ఇలాగే సేవలను నిలిపివేసింది. ఆ తర్వాత ఓలా, ఉబర్ సంస్థలు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయడంతో న్యాయస్థానం పాత తీర్పును పక్కనబెట్టింది. మోటార్ వాహనాల చట్టం ప్రకారం బైక్ ట్యాక్సీలను కూడా రవాణా వాహనాలుగా పరిగణించవచ్చని, అవసరమైన చట్టబద్ధమైన అనుమతులతో వీటిని నడుపుకోవచ్చని కర్ణాటక కోర్టు స్పష్టం చేసింది. ప్రస్తుతం మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ ఆకస్మిక నిర్ణయంతో దీనిపై ఆదారపడిన రైడర్లు, స్థానిక ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

## గుడ్‌న్యూస్.. భారీ పతనం..
## తులంపై రూ.5 వేలు తగ్గిన బంగారం ధర..!

క్రమంగా దిగి వస్తున్న బంగారం ధరలకు నాలుగైదు రోజుల కిందట ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. అయితే రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న బంగారం, వెండి ధరలు రెండు రోజుల నుంచి మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. నాలుగు రోజుల కిందట తులం బంగారం ధర రూ.1,62,000లకుపైగా వెళ్లగా, ప్రస్తుతం భారీగానే దిగి వచ్చింది.మే 13వ తేదీన తులం బంగారం ధర రూ.1,62,000 ఉండగా, మే 16వ తేదీన అంటే మూడు రోజుల్లోనే భారీగా దిగి వచ్చింది. ప్రస్తుతం మే 16న మధ్యాహ్నం సయమానికి తులం బంగారంపైఈ రూ.980 రూపాయలు తగ్గుముఖం పట్టింది. ధర తగ్గిన తర్వాత తులం బంగారం ధర రూ.1,56,930 వద్దకు చేరుకుంది. అంటే ఈ మూడు రోజుల్లోనే 5 వేలకుపైగా దిగి వచ్చింది.అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.900 వరకు తగ్గి రూ.1,43,850 వద్ద కొనసాగుతోంది. అదే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై 730 రూపాయలు దిగి వచ్చి ప్రస్తుతం రూ.1,17,700 వద్ద కొనసాగుతోంది. ఒక్కసారిగా పెరిగిన బంగారం ధరలు.. అదే స్థాయిలో దిగి



రావడం కొంత ఉపశమనం కలుగుతుందనే చెప్పాలి. కొన్ని రోజుల్లో పెళ్లిళ్ల సీజన్ మొదలు కానుంది. ధరలు పెరిగినట్లయితే సామాన్యులకు పెను భారంగా మారనుంది.వెండి కూడా భారీగానే దిగి వచ్చింది. కిలో పై ఏకంగా10 వేల రూపాయల వరకు తగ్గింది. ప్రస్తుతం వెండి ధర రూ.2,80,000 వద్ద కొనసాగుతోంది. హైదరాబాద్, చెన్నై, కేరళలో మాత్రం కాస్త ఎక్కువగా ఉంది. ఇక్కడ రూ.2,90,000 వద్ద ట్రేడవుతోంది. అంటే ఇతర ప్రాంతాలకంటే ఈ మూడు ప్రాంతాల్లో రూ.10 వేల వరకు ఎక్కువగా ఉందనే చెప్పాలి. హైదరాబాద్, విజయవాడలలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర 1,56,930 రూపాయలు ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర 1,43,850 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి, అమెరికాలో ద్రవ్యోల్బణ భయాలు ప్రభావంతో బంగారం ధరలు మరోసారి ఒత్తిడికి గురయ్యాయి. మార్కెట్‌లో 24 క్యారెట్లు, 22 క్యారెట్లు, 18 క్యారెట్ల బంగారం ధరలు తగ్గగా, వెండి ధరలు కూడా భారీగా పడిపోయాయి. ముఖ్యంగా కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.10 వేల వరకు తగ్గడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## కోట్ల ఆన్‌లైన్ బిజినెస్ ను మూసేస్తున్నా

### వ్యాపారవేత్త అంకుర్ వారికూ

**బిజినెస్**

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కోర్సులను అందించే తన రూ.100 కోట్ల ఆన్‌లైన్ వ్యాపారాన్ని మూసివేయనున్నట్లు కంటెంట్ క్రియేటర్, వ్యాపారవేత్త అంకుర్ వారికూ ప్రకటించారు. 2020లో ప్రారంభించిన ఈ బిజినెస్ తాను ఊహించిన దానికంటే.. ఎంతో వృద్ధి చెందిందన్నారు. అయినప్పటికీ దీనిని ఇంకా కొనసాగించడంలో అర్థం లేదంటూ.. ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట తీవ్ర చర్చకు దారి తీసింది. 'నేను నా రూ.100 కోట్ల ఆన్‌లైన్ కోర్సుల బిజినెస్‌ను మూసివేస్తున్నా. 2020లో ప్రారంభమైనప్పటి నుంచి నేను ఊహించిన దానికంటే ఇది ఎంతో అభివృద్ధి



చెందింది. ఇప్పటివరకు 5 లక్షల మంది విద్యార్థులు కోర్సులు నేర్చుకున్నారు. రూ.100 కోట్ల అమ్మకాలు సాగాయి. రూ.25 కోట్లు లాభాలు వచ్చాయి. అయినా.. దీనిని ఇంకా ఇలాగే కొనసాగించడంలో అర్థం లేదు' అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అంకుర్ ప్రకటనపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అంకుర్ నిర్ణయం వెనుక కృత్రిమ మేధ కారణమా అని ఓ నెటిజన్ ప్రశ్నించగా, అయ్యుండొచ్చని వ్యాపారవేత్త సమాధానమిచ్చారు. కాగా.. అంకుర్ మరో కొత్త వ్యాపారాన్ని ఏమైనా ప్రారంభించనున్నారా ? అనే సందేహాలను కూడా నెటిజన్లు వ్యక్తం చేశారు.

# స్పోర్ట్స్

## టీమిండియాలో భారీ మార్పులు..

2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఘన విజయం తర్వాత భారత వన్డే జట్టు ప్రదర్శన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో పరాజయం, ఆ తర్వాత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాభవం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో అఫ్గానిస్తాన్‌తో జరిగే వన్డే సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, సెలెక్టర్లు ఇప్పటి నుంచే జట్టును పునర్నిర్మించే పనిలో పడ్డారు. దీనిలో భాగంగానే దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన యువ ఆటగాళ్లకు ఈ సిరీస్‌లో పెద్దపీట వేయబోతున్నట్లు సమాచారం. కర్ణాటకకు చెందిన ఎడమచేతి వాటం బ్యాటర్ దేవదత్ పడిక్కల్ గత కొంతకాలంగా సెలెక్టర్ల తలుపు తడుతూనే ఉన్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో అతడు సృష్టించిన పరుగుల సునామీ చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే.కేవలం తొమ్మిది మ్యాచ్‌ల్లోనే 90కి పైగా సగటుతో 725 పరుగులు సాధించి, టోర్నీలోనే రెండో అత్యధిక రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో నాలుగు భారీ సెంచరీలు ఉండటం విశేషం. ప్రస్తుతం టీమిండియా రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో పూర్తిగా ఫిట్‌గా లేకపోవడంతో, అఫ్గాన్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్‌తో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్ ప్రారంభించే




అవకాశాలు మెండుగా ఉన్నాయి.భారత జట్టులోకి మరో వికెట్ కీపర్ బ్యాటర్‌ను తీసుకోవాలని యాజమాన్యం గట్టిగా భావిస్తోంది. ఈ రేసులో అందరికంటే ముందు వరుసలో ఉన్నాడు ఇషాన్ కిషన్. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వేట సాగించిన కిషన్, 2026 టీ20 ప్రపంచకప్ విజయంలోనూ కీలక పాత్ర పోషించాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లపై విరుచుకుపడుతూ వేగంగా పరుగులు రాబట్టడంలో కిషన్ దిట్ట. కేఎల్ రాహుల్ మొదటి ఛాయిస్ కీపర్‌గా ఉన్నప్పటికీ, కిషన్ రూపంలో ఒక ఎడమచేతి వాటం దూకుడున్న బ్యాటర్ జట్టుకు అదనపు బలాన్ని ఇస్తాడనడంలో సందేహం లేదు. వన్డేల్లో 27 మ్యాచ్‌లాడి 42 సగటుతో ఒక డబుల్ సెంచరీతో సహా 933 పరుగులు చేసిన ఘనమైన రికార్డు ఇషాన్ సొంతం. ఐపీఎల్ 2026 కనుగొన్న అద్భుత వజ్రం ప్రిన్స్ యాదవ్. తన బుల్లెట్ లాంటి వేగంతో ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించడం ఇతడి శైలి. ఈ సీజన్‌లో విరాట్ కోహ్లీని అవుట్ చేసిన తీరే ఇతడి నైపుణ్యానికి నిదర్శనం. కేవలం ఐపీఎల్‌లోనే కాకుండా విజయ్ హజారే ట్రోఫీలోనూ ప్రిన్స్ సత్తా చాటాడు.టోర్నీలో 18 వికెట్లతో టాప్-5 బౌలర్లలో ఒకడిగా నిలిచాడు. 2027 ప్రపంచకప్ దక్షిణాఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై జరగనుంది. అలాంటి పిచ్‌లపై ప్రత్యర్థులను భయపెట్టే ఎక్స్‌ప్రెస్ పేసర్ భారత్‌కు ఎంతో అవసరం. ఆ లోటును భర్తీ చేయగల సత్తా ప్రిన్స్ యాదవ్‌కు ఉంది. అందుకే అతడిని వన్డే జట్టులోకి తీసుకురావాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. అఫ్గానిస్తాన్‌తో జరిగే వన్డే సిరీస్ టీమిండియా భవిష్యత్తుకు దిక్సూచి లాంటిది. పాత తప్పులను సరిదిద్దుకుంటూ, యువ రక్తాన్ని జట్టులోకి ఆహ్వానించి కొత్త శకానికి నాంది పలకడానికి ఇది సరైన సమయం. దేవదత్ పడిక్కల్ క్లాస్ బ్యాటింగ్, ఇషాన్ కిషన్ మాస్ పవర్, ప్రిన్స్ యాదవ్ బుల్లెట్ వేగం తోడైతే భారత జట్టు వన్డేల్లో మళ్లీ నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. సెలెక్టర్ల సాహసోపేత నిర్ణయాలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయో చూడాలి.

## కెప్టెన్‌గా ఫాతిమా సనా..
## ఐదుగురికి తొలిసారి ప్రపంచకప్ ఛాన్స్..!



పదో సీజన్ మహిళల పొట్టి వరల్డ్‌కప్ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. ముక్కోణపు సిరీస్‌ను, ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఫాతిమా సనా కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని సెలెక్టర్లు ఎంపిక చేశారు. సీనియర్లతో పాటు ప్రతిభావంతులైన జూనియర్లకు ప్రాధాన్యమిచ్చారు. అంతేకాదు రిజర్వ్ ప్లేయర్లుగా ఏకంగా ఆరుగురిని పాక్ బోర్డు తీసుకుంది.వన్డే ప్రపంచకప్‌లో పాక్‌ను నడిపించిన ఫాతిమా సనా పొట్టి కప్‌లోనూ కెప్టెన్‌గా ఎంపికైంది. సీనియర్లు మునీబా అలీ, అలియా రియాజ్, సదియా ఇక్బాల్, డయానా బైగ్, తస్మియా రుబబ్, తుబ హసన్‌లకు స్క్వాడ్‌లో చోటు దక్కింది. అండర్ -19 క్రికెట్‌లో అదరగొట్టిన ఇమన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సైరా జుబీన్‌లు మొదటిసారి ప్రపంచకప్ ఆడబోతున్నారు. ఈ పదిహేను మంది పోను.. ఆరుగురు రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపికయ్యారు.

**పాకిస్థాన్ స్క్వాడ్ :** ఫాతిమా సనా(కెప్టెన్), అలియా రియాజ్, అయేషా జఫర్, డయానా బైగ్, ఎమన్ ఫాతిమా, గుల్ ఫెరోజా, ఇరామ్ జవేద్, మునీబా అలీ(వికెట్ కీపర్), నష్రా సంధు, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సడియా ఇక్బాల్, సైరా జబీన్, తస్మియా రుబబ, తుబ హసన్.


**రిజర్వ్ ప్లేయర్లు --** అంబర్ కైనత్, మొమినా రియాసత్, సదాఫ్ షమాస్, సిద్రా అమిన్, సైయదా అరూబ్, ఉమే హనీ.

జూన్ 12 నుంచి ఇంగ్లండ్ వేదికగా టీ20 వరల్డ్‌కప్ మొదలవ్వనుంది. అంతకంటే ముందు ఐర్లాండ్, పాకిస్థాన్, వెస్టిండీస్ ముక్కోణపు సిరీస్‌లో తలపడనున్నాయి. ఈ మూడు జట్ల మధ్య డబ్లిన్‌లో మే 28 నుంచి జూన్ 4 వ తేదీ ఈ సిరీస్ జరుగనుంది.ప్రపంచకప్ లీగ్ దశ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్ జూన్ 14న భారత జట్టును ఢీకొట్టనుంది. జూన్ 17న దక్షిణాఫ్రికాతో, జూన్ 20 వ తేదీన బంగ్లాదేశ్‌తో, జూన్ 23న ఆస్ట్రేలియా, జూన్ 27వ తేదీన నెదర్లాండ్స్‌తో పాక్ తలపడనుంది.

## ఐపీఎల్ ఫైనల్‌కు మొహ్సిన్ నఖ్వీ..

### అసలు కారణమిదే..!

అంతర్జాతీయ క్రికెట్ మండలి సమావేశం ఈసారి భారత్‌లో జరుగనుంది. ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్ ఫైనల్ రోజే మే 31న ఐసీసీ ప్రతినిధులతో ఛైర్మన్ జై షా భేటీ కానున్నారు. ఈ త్రైమాసిక సమావేశానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ హాజరవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతన్నాయి. ఎందుకంటే ఎప్పుడు చూసినా బీసీసీఐపై.. భారత జట్టుపై రగిలిపోయే నఖ్వీ ఈ మీటింగ్‌కు వస్తాడా? అనేది ఇంకా ఖరారు కాలేదు.ఐసీసీ కార్యాలయం దుబాయ్‌లో ఉన్నందున త్రైమాసిక సమావేశం దోహా, ఖతార్‌లో మార్చి -- ఏప్రిల్ మధ్య జరగాల్సింది. కానీ, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్నందున.. ఈ సమావేశం వేదికను భారత్‌కు మార్చారు. కొత్త షెడ్యూల్ ప్రకారం జై షా మే 21న ఐసీసీ సభ్యులతో వర్చువల్‌గా సమావేశం కానున్నారు.




అనంతరం మే 30న లేదా మే 31న ఐపీఎల్ ఫైనల్ రోజే అహ్మదాబాద్‌లో షా.. వారితో భేటీ అవుతారని సమాచారం. అయితే.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చీఫ్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడైన మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు రావడంపై ఇంకా స్పష్టత లేదు.

**ఆసియా కప్ ట్రోఫీతో పరార్**

నిరుడు ఆసియా కప్‌ను విజేతగా నిలిచిన భారత జట్టుకు ట్రోఫీ ఇవ్వకుండా పరారైన నఖ్వీ.. టీ20 ప్రపంచకప్‌లో టీమిండియాతో ఆడమని పెద్ద రాద్ధాంతం చేశాడు. చివరకు శ్రీలంక అధ్యక్షుడి జోక్యంతో దిగొచ్చిన నఖ్వీ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని భారత్‌కు వస్తాడు? అనేది విశ్లేషకుల మాట. ఒకవేళ.. అతడు రావాలుకున్నా అందుకు పాక్ ప్రభుత్వం అనుమతివ్వాలి. భారత ప్రభుత్వం కూడా అందుకు అంగీకరించాలి. లేదంటే.. పాక్‌లోనే ఉండి వర్చువల్‌గా నఖ్వీ ఐసీసీ సమావేశానికి హాజరయ్యే అవకాశముంది.

# అనుపమ మరీచిక ట్రైలర్ విడుదల





టాలీవుడ్ యంగ్ హీరో విరాజ్ అశ్విన్, స్టార్ హీరోయిన్లు రెజీనా కాసాంధ్రా, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మరీచిక'. సతీష్ కాసెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా చిలకా ప్రోడక్షన్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, మేఘన చిలకా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సస్పెన్స్, లవ్ అండ్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే.. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'మ్యూజికల్ మాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించడం విశేషం. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అద్భుతమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మే 29న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

## క్రమశిక్షణ కలిగిన నటుడు విజయ్: మాళవిక



కోలీవుడ్ అగ్ర కథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్‌పై నటి మాళవిక మోహనన్ ప్రశంసలు కురిపించారు. విజయ్‌తో కలిసి మాస్టర్ సినిమాలో నటించిన ఆమె ఆయనతో తనకున్న స్నేహం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ షూటింగ్‌లోనే విజయ్‌ను తొలిసారి కలిసినట్లు చెప్పారు. మాస్టర్' సినిమా మొదటిరోజు షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చింది. నా డైలాగ్స్ మీదే దృష్టిపెట్టాను. ఆయన మాత్రం ఎలాంటి కష్టమైన సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా ప్రశాంతంగా ఉంటారు. ప్రతి విషయాన్ని గమనిస్తూ పూర్తిగా పని పైనే ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడు అవసరం వచ్చినా ఫోన్ చేయగలిగే స్వేచ్ఛ ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. విజయ్ క్రమశిక్షణ తనపై ప్రభావం చూపిందని ఆమె అన్నారు. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ లాంటి సీనియర్ నటుల సినిమాల్లో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఉదయం 7 గంటలకు కాల్‌షీట్ ఉంటే 6:55కే సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు అని తెలిపారు. 'మాస్టర్' సినిమాలో విజయ్‌తో కలిసి డ్యాన్స్ చేసే అవకాశం రాలేదని సరదాగా ఇప్పటికీ ఆయనతో చెబుతుంటానని మాళవిక నవ్వుతూ చెప్పారు

## అగ్రతారల మూవీకి త్రిష దూరం
## కమల్, రజనీ సినిమాను తిరస్కరించినట్లు వార్తలు



వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హాసన్ – రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ – రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది.


## ఆ సినిమాలో నటించి తప్పుచేశా..

### -ఇప్పటికీ బాధపడుతుంటా..!



నటి సదా ఓ ఇంటర్వ్యూలో తన 20 ఏళ్ల సినీ ప్రస్థానం, కెరీర్ ఎదుగుదల, సవాళ్లు, వ్యక్తిగత అభిప్రాయాలపై ఆసక్తికర విషయాలను మాట్లాడారు. తెలుగు సినీ పరిశ్రమలో తన సుదీర్ఘ ప్రయాణం గురించి, ప్రేక్షకులతో తనకున్న బంధం గురించి ఆమె ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సదా మాట్లాడుతూ తన 20 ఏళ్ల సినీ ప్రస్థానంలో తక్కువ సినిమాలు చేసినప్పటికీ, జయం, అపరిచితుడు, నితిన్, ఉదయ్ కిరణ్ వంటి నటులతో చేసిన చిత్రాలు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యాయని సదా అన్నారు.తన ప్రతిభకు తగిన గుర్తింపు రాలేదని ప్రేక్షకులు తరచుగా భావిస్తుంటారని, ఈ ప్రశ్నలకు సమాధానం తన వద్ద కూడా లేదని, కొన్ని విషయాలు మన నియంత్రణలో ఉండవని ఆమె అభిప్రాయపడ్డారు. జయం లాంటి పెద్ద హిట్ తర్వాత కూడా కెరీర్‌లో విరామం వచ్చిందని సదా గుర్తు చేసుకున్నారు. అవకాశాలు రాలేదని చెప్పలేనని, అవి తన వరకు చేరలేదని పేర్కొన్నారు. తాను ముంబైలో నివసించడం, అప్పట్లో సోషల్ మీడియా అంత బలంగా లేకపోవడం వల్ల ఇండస్ట్రీలో గాడ్‌ఫాదర్ లేని తనకు, మధ్యవర్తులపై ఆధారపడాల్సి వచ్చిందని వివరించారుజయం తర్వాత తాను ఐటీ చదువులను కొనసాగించడానికి తిరిగి వెళ్ళినట్లు, సినిమా నేపథ్యం లేని తనకు నటన ఎంతవరకు విజయవంతమవుతుందో తెలియక అప్పట్లో కెరీర్‌ను నమ్మలేదని తెలిపింది. జయం లేదా అపరిచితుడు వంటి చిత్రాలు ఎంత పెద్ద విజయాలు సాధించాయో అప్పట్లో తనకు తెలియదని, ఈ విజయం తన జీవితంలో లేకపోతే తాను ఇక్కడ ఉండేదాన్ని కాదని ఆమె అన్నారు. తాను రెండు, మూడు సంవత్సరాలు సినిమాల నుండి అదృశ్యమైనప్పటికీ, తిరిగి వచ్చినప్పుడల్లా అదే ఆదరణ, ప్రేమ లభిస్తుందని సదా సంతోషంగా చెప్పారు.జయం సినిమాలోని వెళ్ళవయ్యా వెళ్ళు అనే డైలాగ్ కోసం థియేటర్‌కు వచ్చిన ప్రేక్షకులు ఉన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. నితిన్ సినిమాలో రీమేక్ అయిన రాను రానంటూనే చిన్నదో పాట గురించి మాట్లాడుతూ.. ఈ పాట రీమేక్‌లో సదాను అడిగారని, ఆమె నిరాకరించారని వార్తలు ఖండించారు సదా. తనను అడగలేదని, చాలాసార్లు ప్రాజెక్ట్ ఆఫర్‌లు తన వరకు చేరవని, నిర్మాతలు తాము ప్రయత్నించామని చెప్పినా, అది తన నంబరు చాలామంది దగ్గర ఉన్నప్పటికీ, మధ్యలో ఎక్కడ ఆగిపోతుందో తెలియదని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు.టార్చ్ లైట్ అనే తమిళ చిత్రం (తెలుగులో వేరే పేరుతో విడుదలైంది) గురించి మాట్లాడుతూ, ఒక బిడియమైన వ్యక్తిగా అలాంటి ధైర్యవంతమైన పాత్ర చేయడం చాలా భయంగా అనిపించిందని, అయితే అలాంటి కథను చెప్పడం అవసరమని భావించి చేశానని సదా తెలిపారు. అయితే, ప్రేక్షకులు దానిని ఒక మహిళ కథగా చూడకుండా, సదా ఎందుకు ఇలాంటి పాత్ర చేసింది అని విమర్శించారని, అది తనను షాక్‌కు గురిచేసిందని చెప్పారు. ఆ సినిమా చేసి తప్పు చేశా అని పించిందని ఆమె తెలిపారు. బోల్డ్ క్యారెక్టర్లు చేయకూడదన్నది తన సిద్ధాంతం కాదని, అయితే ఒక సబ్జెక్టుకు అది అవసరమైతే మాత్రమే చేస్తానని చెప్పుకొచ్చింది సదా.

## జస్ట్ వావ్..
## 'పెద్ది' ట్రైలర్‌పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం మే 18న విడుదల కాబోతున్న ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి ముందే వీక్షించారు. ట్రైలర్ చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చిత్ర యూనిట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రైలర్ గురించి చిరంజీవి ట్వీట్ చేస్తూ.. ఇప్పుడే పెద్ది ట్రైలర్ చూశాను, జస్ట్ వావ్ అంతే! 3 నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ ప్యూర్ పవర్ ప్యాక్డ్‌గా ఉంది. చరణ్, బుచ్చిబాబు, రెహమాన్.. ఇలా ఒక్కొక్కరు తమ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. అందరూ కలిసి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేశారు. ఈ సినిమా గురించి మనం ఎంత ఊహించుకున్నా, ఈ ట్రైలర్ దాన్ని మించి ఉంటుంది. ఇందులో ఎమోషన్, ఎలివేషన్, మ్యాడ్నెస్ అన్నీ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి అని చిరు కొనియాడారు. ఎప్పటికప్పుడు తన సినిమాలకు లేదా చరణ్ సినిమాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను లీక్ చేస్తూ అభిమానులను అలరించే చిరంజీవి, ఈసారి కూడా తన అలవాటును రిపీట్ చేశారు. 'చాలా రోజులయ్యింది మీకు 'చిరు లీక్స్' ఇచ్చి' అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తూ, పెద్ది ట్రైలర్‌లోని ఒక పవర్‌ఫుల్ డైలాగ్‌ను ఆయన లీక్ చేశారు. 'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు? నేను పోరాడాను సారు.. అంటూ ట్రైలర్‌లోని ఈ డైలాగ్ ఎంతో అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ ప్రశంసించారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబుకు క్షమాపణలు చెబుతూ.. 'సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పి లీక్ చేయాల్సి వచ్చింది' అంటూ చిరంజీవి చమత్కరించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ట్రైలర్ మే 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగాస్టార్ స్వయంగా ఇచ్చిన ఈ రివ్యూతో మెగా అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో 'పెద్ది' ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com